జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 12 పక్షపత్రిక జూన్ 16-30, 2016



## భారత ఆర్థిక సంస్కరణలు@25



## దేశవ్యాప్త విధానంలో భాగంగానే కాశ్మీర్‌కి స్వయంప్రతిపత్తి

# పేదరికాన్ని అధిగమించి లక్ష్యాన్ని సాధించిన ఎంసెట్ మెడికల్ టాపర్‌కి జేపీ అభినందనలు

**చిరంజీవి మాచాన హేమలతకు,**

ఆంధ్రప్రదేశ్ ఎంసెట్‌లో నెగ్గి మొదటి ర్యాంకుతో వైద్యవిద్యలోకి ప్రవేశిస్తున్నందుకు మనసారా అభినందనలు. చదువుకునే అవకాశం అందించాలేగానీ పేద, అణగారిన వర్గాల్లో ఆణిముత్యాలు ఉన్నాయని చెబుతూ అందరికీ నాణ్యమైన విద్యను, ఆరోగ్యాన్ని అందించాలని నిరంతరం పోరాడే లోక్‌సత్తా వారందరికీ గర్వకారణమైన విజయం నీది. అరకొర రాబడి గల కుటుంబంలో ముగ్గురు పిల్లల చదువు భారంతో నెగ్గుకొస్తూ నిన్ను గెలిపించేందుకు మీ తల్లిదండ్రులు చాలా శ్రమించి ఉంటారు. వారి పాత్రను ఎంత ప్రశంసించినా తక్కువే. సరైన విద్యను, ఆరోగ్యాన్ని రాజకీయానికి కేంద్ర బిందువు చేస్తే అలా తల్లిదండ్రులు మీద ఆర్థిక భారం లేకుండానే నీలాంటి మణి మాణిక్యాలెన్నో ఇంకా వెలుగులోకి వస్తాయి.




చదువంటే డాక్టర్, ఐఐటియన్, ఐఏఎస్ మాత్రమే, గెలవటమంటే ఫస్టు ర్యాంకే అని కాకుండా, కష్టపడితే నచ్చినరంగంలో రాణించగలం అని స్ఫూర్తినిచ్చేలా నీ విజయం ఉండాలని కోరుకుంటున్నాను. ఇక ముందు కూడా జయాపజయాలకు పొంగిపోకుండా, కుంగిపోకుండా నీవు విజయాలు సాధించాలని, సమాజానికి నీవంతు సేవ చేయాలని మనసారా కోరుకుంటూ... ఈ క్రమంలో నీకు కావలసిన తోడ్పాటు అందించటానికి లోక్‌సత్తా సిద్ధంగా ఉందని తెలియచేస్తున్నాను.

నీతోపాటు కష్టపడి చదివిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థినివిద్యార్థులందరికీ శుభాకాంక్షలతో.....

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
వ్యవస్థాపకులు, లోక్‌సత్తా

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూన్ 16-30, 2016

సంపుటి - 7 సంచిక - 12

## లోపలి పేజీల్లో...

భారత ఆర్థిక సంస్కరణలు @ 25............... 5

ఆర్థిక సంస్కరణలు కాదు, ప్రభుత్వ పాత్ర......... 13

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ : రాజకీయ ............... 17

రెండు రాష్ట్రాలు, రెండేళ్లు............................ 19

అప్పుల్లో తెలుగు ప్రజలు............................. 21

వ్యవసాయంలో ఉపాధి... వృద్ధి మాత్రం ......... 23

ఏపీలో పేదరికం పదిశాతం కూడా లేదు ........ 25

చబహార్‌పై ఎట్టకేలకు కుదిరిన ఒప్పందం........ 27

దిద్దుకున్నాడు, గెలిపించాడు....................... 29

ఎన్నికల సంస్కరణలపై చర్చకు దీదీ పిలుపు....... 30

దేశవ్యాప్త వికేంద్రీకరణ విధానంలో భాగంగా ... 31

మెరుగ్గా ఉంది.. కానీ నిజమైన పరివర్తనకు...... 32

రిజర్వేషన్ కోటాల పెంపు నుంచి నాణ్యమైన.... 33

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

## సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# బతికించే ఆపరేషన్లు కావాలి



తమిళనాడులోని తంజావూరు, అరవకురిచ్చి శాసనసభ స్థానాలకు జరగాల్సిన ఎన్నికలను రద్దు చేయవలసిందిగా కేంద్ర ఎన్నికల సంఘం చేసిన సిఫార్సును చూస్తే సామెత చెప్పినట్టు, గుర్రం తుర్రుమన్నాక గుర్రపుశాలకు తాళం వేసి చూడండహో అని జబ్బలు చరుచుకున్నట్టుంది. తమిళనాడు ఎన్నికల్లో రూ.4,000 కోట్ల అక్రమ వ్యయాన్ని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తాయిలాల్ని అడ్డుకోలేని ఈసీ.. చివరకు ఏదో చేశామనిపించుకోవటానికి రెండు స్థానాల్లో చర్యలు తీసుకుంది. అన్ని ప్రధాన పార్టీలూ ఎన్నికల్లో ఓట్లు కొంటుండటంతో మన ఎన్నికలు ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్ అన్న తరహాలో తయారయ్యాయి. ఎన్నికల్లో వేల కోట్ల అక్రమ డబ్బును ఖర్చు చేయటాన్ని కేవలం ఈసీ మాత్రమే కట్టడి చేయలేదు గానీ, ఎన్నికల తీర్పుల్ని ఉచితాల ప్రలోభం ప్రభావితం చేయకుండా అడ్డుకునే అవకాశాన్ని మాత్రం ఈసీ జారవిడుచుకుందనే చెప్పాలి. “2006లో తమిళనాడు ఎన్నికల్లో ఉచిత కలర్ టీవీలను ఎన్నికల హామీగా డీఎంకే ఇచ్చినప్పుడు మౌనం వహించిందని, అందువల్లే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అదే హామీని ఇస్తోందని, ఇప్పటికైనా మౌనం వీడి ఎటువంటి హామీల్ని ప్రజలకు ఇవ్వటం వల్ల రాజ్యాంగం ఆశించిన సార్వభౌమాధికారాన్ని అందుకోగలుగుతోరే గీత గీయాలని కోరుతూ” నేను ఎన్నికల సంఘానికి మే, 2008లో కర్ణాటక ఎన్నికల సందర్భంగా లేఖ రాశాను. ఆ తర్వాత 2009 మార్చిలో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అనుచిత హామీల సందర్భంగా మళ్లీ లేఖ రాశాను. ఆరోజు ఈసీ సక్రమంగా స్పందించి ఉంటే ఈవేళ తమిళనాడు ఎన్నికల్లో ఉచితాల్ని చూసి ఇంత గుండెలు బాదుకోవాల్సిన పని ఉండేది కాదు. తాను అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఆధార్ కార్డును ఉపయోగించి రూ.36,000 కోట్ల అవినీతిని ఆపామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా దేశవిదేశాల్లో చెబుతున్నారు. యూపీయే ప్రభుత్వం, అంతకుముందు లైసెన్స్ రాజ్ వ్యవస్థ వైఫల్యాల ముందు ఇది పెద్ద విజయంలా కనిపించవచ్చుకానీ.. వాస్తవానికి దేశంలోని అవినీతిలో ఇది చాలా చిన్న మొత్తం. దేశవ్యాప్తంగా పార్టీలు ఎన్నికలస్తే దాదాపు రూ.2లక్షల కోట్లు వెదజల్లుతూ ఫలితాల్ని మార్చేస్తున్నాయని, నిజాయతీపరులు పాలకులుగా ఎదిగే అవకాశాలు లేకుండా చేస్తున్నాయని అంచనాలు చెబుతున్నాయి. రాజ్యసభ దందా అదనం. దేశానికున్న అద్భుతావకాశాల్ని నీరుగారుస్తూ సవారు తీయాల్సిన దేశాన్ని వెనక్కి గుంజుతున్న భ్రష్ట రాజకీయానికి కారణమైన రాజకీయ అవినీతిని వదిలేసి చిల్లర అవినీతిని పట్టుకోవటం వల్ల మౌలిక మార్పేమీ రాదు. అవినీతిని అంతం చేయాలని మోదీకున్న తపన కార్యరూపం దాల్చాలంటే, రాజకీయానికి కేంద్ర బిందువుగా ఉన్న రాష్ట్రాలలో ఎన్నికల సంస్కరణల్ని వేగంగా అమలు చేయాలి. ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు చేస్తే చాలా మేరకు రాజకీయ అవినీతి తగ్గుతుంది. దీంతోపాటు స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తే ఓటు విలువ తెలుస్తుంది. కొంతమేరయినా దామాషా ఎన్నికల పద్ధతిని జోడించటం ఫలితాల్ని మెరుగుపరుస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి లేకుండా చెప్పిన టైంకి సేవలందించేందుకు ‘సర్వీస్ గ్యారంటీ’ చట్టాన్ని తీసుకొస్తే, ప్రజాప్రతినిధులకు చాలామేర ఖర్చు తగ్గి దోపిడీకి పాల్పడాల్సిన అవసరముండదు. ఒకపక్కన రాజకీయం పెద్ద వ్యాపారంలా మారిపోయి డబ్బే ఎన్నికలైపోతే, గెలిచాక కూడా మరోసారి ఎన్నికల వాతావరణాన్ని తలపించేలా ఫిరాయింపులు జరుగుతుంటే.. మనం పాలనలో ఒక పరిధి దాటి అవినీతిని కట్టడి చేయలేం. డబ్బు ఖర్చు చేసినా ఓడిపోవచ్చుగానీ, డబ్బు ఖర్చు చేయకపోతే గెలిచే అవకాశమే లేని ఎన్నికల సంస్కృతిని తయారుచేసుకున్నాం. ఎక్కడైనా ఎన్నికల్లో పెద్దగా డబ్బు ఖర్చు చేయకుండా అభ్యర్థి గెలిచాడంటే, అక్కడ పార్టీయే అవినీతి డబ్బును గుమ్మరిస్తోందన్న మాట. పార్టీ సంచులతో గెలిచినవారు.. పార్టీని సొంత ఎస్టేట్‌గా మార్చుకున్న వారి వంశపారంపర్య రాజకీయాలకు విధేయులుగా ఉంటున్నారు. ఈసీ చెప్పినట్టు ‘స్వేచ్ఛగా నిజాయతీగా జరగని ఎన్నికల ద్వారా ఎన్నికైనవారు ఆ నియోజకవర్గ ప్రతినిధులకు నిజమైన ప్రతినిధులు కారు’. కానీ ఈ దేశాన్ని అబద్ధపు ప్రతినిధులు పరిపాలించకుండా చేయాలంటే, ఆపరేషన్ సక్సెస్ అయి పేషెంట్ కూడా బతకాలంటే అది ఈసీ వల్లయ్యే పనికాదు. కేంద్రప్రభుత్వం చొరవ తీసుకుని రాజకీయ, పాలనా సంస్కరణల్ని తీసుకురావాలి. ప్రజల్లో చైతన్యం వస్తే సంస్కరణలు తెచ్చిన మంచి మార్పు శాశ్వతమవుతుంది.




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# భారత ఆర్థిక సంస్కరణలు @ 25

**18వ శతాబ్దంలో**

**ప్రపంచ స్థూల ఆదాయంలో భారతదేశ వాటా 25శాతం దాకా ఉండేది. ప్రపంచంలోనే భారత్ అగ్రరాజ్యంగా ఉండేది.**

**స్వతంత్రం వచ్చిన 1947లో**

ప్రపంచ జీడీపీలో భారత్ వాటా కేవలం 1శాతం

**1991లో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రవేశపెట్టాక**

ఈ వాటా 2శాతానికి పెరిగింది

**2004లో భారత్ వెలిగిపోతోంది అంటూ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఎన్డీయే ప్రభుత్వం ప్రచారం చేసినప్పుడు**

ప్రపంచ జీడీపీలో భారత్ వాటా ఇంకా 2శాతమే

**2015లో**

ప్రపంచ జీడీపీలో మనదేశ వాటా 2.86శాతం

**భారత్ నిజంగా వెలిగిపోవాలి, ప్రపంచంలోనే ఉన్నతస్థానానికి రావాలి అంటే**

ప్రపంచ ఆదాయంలో కనీసం 15శాతాన్ని సాధించాలి.

... 2016 జూన్–జులై నాటికి పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఆర్థిక సంస్కరణలపై సమీక్షకు, స్పష్టతకు కీలకం ఈ గణాంకాలు.

భారతదేశంలో స్వేచ్ఛా వాణిజ్య సంస్కరణలు రాజకీయ నాయకుల సంకల్పంతోనో, ప్రజల డిమాండ్‌గానో రాలేదు. విధిలేని పరిస్థితుల్లో ఆ సంస్కరణల్ని తేవాల్సి వచ్చింది. దేశంలో రోజువారీ పాలనజమాఖర్చులకు కూడా టికాణా లేకపోవటంతో లైసెన్స్ రాజ్య వ్యవస్థలోకి ఉత్సాహవంతులైన పౌర ఎంటర్‌ప్రెన్యూర్‌లను ఆహ్వానించారు. స్వదేశీ, విదేశీ ప్రయివేటు రంగానికి అవకాశం కల్పించారు.

మంచి రాజకీయాలంటే మంచి ఆర్థికవ్యవస్థే అని ప్రపంచమంతా నిరూపితమవుతున్న తరుణంలో ఈ సంస్కరణలపై 1991లో ప్రారంభంనాటి విమర్శల తీవ్రత తగ్గినా ఇంకా విభేదాలు కొనసాగుతున్నాయి. మరోవైపు ప్రతిపక్షంలో ఉంటే ఈ సంస్కరణలను విమర్శించటం, అధికారపక్షంలోకి వచ్చాక అమలు చేయటం చేస్తున్న ప్రధాన జాతీయ పార్టీలు ఈ సంస్కరణలు సత్ఫలితాలనివ్వటానికి కావలసిన పాలనా, రాజకీయ, న్యాయ, పోలీసు సంస్కరణలు వంటివి తీసుకురాకపోవటం వల్ల అనేక దుష్పరిణామాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మనదేశంలో అమలవుతున్న స్వేచ్ఛా వాణిజ్య సంస్కరణలను ఏరకంగా సంస్కరించుకోవాలన్న ఆలోచన ఈ సందర్భంగా అవసరం.

స్వేచ్ఛా వాణిజ్య సంస్కరణలు ఒక్కసారిగా 1991లోనే మనదేశంలో మొదలవలేదు. ఇందిరాగాంధీ ప్రధాని అయ్యాక



వీటి కోసం ఒక ప్రయత్నం జరిగింది. ఇంతకుముందే అనుకున్నట్టు దేశానికి స్వతంత్రం వచ్చేనాటికి బ్రిటీషు వాళ్లు మన వనరుల్ని గణనీయంగా పీల్చేసి పిప్పిని మనకు వదిలారు. పారిశ్రామిక విప్లవాన్ని కోల్పోవటం భారత్‌కు తీవ్ర నష్టం చేకూర్చింది. అందువల్లే ఒకప్పుడు తనకున్న ప్రపంచ జీడీపీలోని వాటాలో పాతికోవంతుకే భారత్ పరిమితమై 1శాతంతో స్వతంత్ర దేశంగా మనుగడను ప్రారంభించింది. ఈ సమయంలో తొలి ప్రధాని నెహ్రూ అనేక సవాళ్ల మధ్య సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామికీకరణ విలువను గుర్తించినా.. సోవియెట్ యూనియన్ ప్రభావంతో స్వేచ్ఛా వాణిజ్యం ప్రాధాన్యతను తిరస్కరించారు. దీంతో ఉత్పత్తిరంగంతో పెద్దఎత్తున ఉద్యోగాలనివ్వాల్సిన పారిశ్రామిక రంగం కొన్ని భారీ పరిశ్రమలకే పరిమితమైంది. ఇదేసమయంలో దేశ జనాభాలో అత్యధిక శాతం మంది ఆధారపడి వున్న వ్యవసాయరంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఆరోజుల్లోనే స్వేచ్ఛా

వాణిజ్య విధానాల్ని పారిశ్రామిక, వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టాలని రాజగోపాలాచారి, మినూ మసానీ, ఎన్‌జీ రంగా వంటి వారు ప్రతిపాదించినా సోషలిస్టు భావాలకే ప్రాధాన్యత లభించింది. సోవియెట్ యూనియన్ నమూనాలో ఉమ్మడి వ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలన్న కాంగ్రెస్ ప్రతిపాదనను తిప్పికొట్టి ఆహార దివాళా నుంచి దేశాన్ని కాపాడగలిగారుగానీ ఆర్థిక సంస్కరణల్ని మాత్రం ఆనాడు ఉదారవాదులు సాధించలేకపోయారు. దేశ జనాభాలో అత్యధిక శాతం ఆధారపడిన వ్యవసాయంలో ఆదాయం క్షీణిస్తూ వచ్చింది. 1950లో మనతో సమానంగా లేదా మనకంటే వెనకబడి వున్న చైనా, కొరియా, థాయ్‌లాండ్, తైవాన్ వంటి దేశాలు ఉద్యోగాలనిచ్చే ఉత్పత్తిరంగాన్ని పెంచుకుంటూ వేగంగా వృద్ధిని సాధించాయి.

ఇదేసమయంలో దేశంలోని అపారమైన మానవ వనరులు అభివృద్ధి చెందటానికి కావలసిన నాణ్యమైన పాఠశాల విద్య, మంచి వైద్యం విషయంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారు.

నెహ్రూ తర్వాత లాల్‌బహదూర్ శాస్త్రి హయాంలో అవినీతి అంతానికి, వ్యవసాయరంగ విప్లవానికి సి. సుబ్రమణ్యం వంటి వారితో, గట్టి ప్రయత్నం మొదలైనా, ఆయన స్వల్పకాలమే పదవిలో ఉండటం, ఆయన తర్వాత వచ్చిన వారు పరిమిత ఆలోచనే చేయటంతో ఆర్థికరంగం సంకెళ్లలోనే ఉండిపోయింది. శాస్త్రి తర్వాత వచ్చిన ఇందిరా గాంధీ హరిత విప్లవానికి చేయూతనిస్తూ స్వేచ్ఛా వాణిజ్యం దిశగా ఆలోచనలు చేసినా సోషలిస్టు భావాలున్న అనుచరులు, బ్రిటీషు అణచివేతకు వారసులుగా కొనసాగుతున్న బ్యూరోక్రసీ పడనివ్వలేదు. దీంతో లైసెన్స్ రాజ్ మరింత బలంగా వేళ్లూనుకుని దేశంలో అవినీతి, ఆశ్రితపక్షపాతం, అణచివేతలు, బ్యూరోక్రసీ పెత్తనం, బ్లాక్ మార్కెటింగ్ వెర్రితలలు వేశాయి. ఆహారధాన్యాల వ్యాపారాన్ని సైతం జాతీయం చేస్తూ 1970లలో ప్రభుత్వం పనికిమాలిన నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. కానీ తీవ్ర అవినీతి, ప్రభుత్వ అసమర్థత వల్ల ఈ పథకం పత్తా లేకుండా పోయింది.

కనీసం ఇతర దేశాల్లోని సహచరుల్లాగా మనదేశంలోని సోషలిస్టులు నాణ్యమైన విద్య, ఆరోగ్యం గురించి పట్టించుకోకపోవటంతో ప్రజలు నిజమైన అక్షరజ్ఞానం, శారీరక బలం లేకుండా తమ సొంతదేశంలోనే యాచకుల్లా లైసెన్స్‌రాజ్ ప్రభుత్వం ఇచ్చే తాయిలాలు, పందేరాల కోసం ఎదురుచూసేవారుగా తయారయ్యారు. 1970లలో కమ్యూనిస్టు చైనా కూడా బహిరంగ/స్వేచ్ఛా వాణిజ్యానికి గేట్లు ఎత్తినా మనదేశంలో పెద్ద కదలిక రాలేదు. ఇందిరాగాంధీ తర్వాత 1980లలో ఆర్థిక ప్రక్షాళనకు రాజీవ్‌గాంధీ ప్రయత్నించినా ఆయననూ అడ్డుకున్నారు. అయితే ఇందిర హయాంలోలా లైసెన్స్ రాజ్‌కమరీ బలపడలేకపోయింది. చివరికి బంగారాన్ని కుదవబెట్టే పరిస్థితి వచ్చాక విధిలేని పరిస్థితుల్లో ప్రధానమంత్రి పీవీ నరసింహారావు నేతృత్వంలో ఆర్థికమంత్రిగా డా॥ మన్మోహన్ సింగ్ 1991లో ఆర్థిక సంస్కరణలకు తెరతీశారు. ద్రవ్య, బ్యాంకింగ్, క్యాపిటల్ మార్కెట్, పారిశ్రామిక విధానం, వాణిజ్య విధానం, విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం తదితర సంస్కరణల్ని ఇందులో భాగంగా సింగ్ అమలులోకి తెచ్చారు. ద్రవ్య క్రమశిక్షణ తేగలిగారు. వాణిజ్య వ్యవహారాల్లో ప్రభుత్వ




జోక్యాన్ని తగ్గించి రెగ్యులేటరీ అథారిటీలను తెచ్చారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు, ముఖ్యంగా వాజ్‌పేయి ప్రభుత్వం సంస్కరణల్ని క్రమపద్ధతిలో అమలుచేయటంతో భారత్ తిరిగి ఆర్థికశక్తిగా పుంజుకోసాగింది. 2006-08 నాటికి దేశ జీడీపీ వృద్ధి రేటు రికార్డుస్థాయిలో దాదాపు 9శాతానికి చేరుకుంది. స్వయంకృతాల వల్ల మళ్లీ ఒడిదుడుకులకు లోనై ఇప్పుడు 5-6వాస్తవ శాతంతో మందగమనంలో ఉంది.

స్వేచ్ఛా వాణిజ్యం రాకముందు మార్చి 1991లో ఆరు బిలియన్ డాలర్ల లోపున్న భారత్ నిల్వలు ఇప్పుడు 350 బిలియన్ డాలర్లను మించాయి. ఈ డబ్బంతా ఇలా వచ్చి అలా పోయేదేనని ఆరోజుల్లో వ్యాఖ్యానించేవారు. కానీ 25 ఏళ్లు గడిచినా వచ్చిన డబ్బు ఆ స్థాయిలో తిరిగెళ్లిపోవటం ఎప్పుడూ జరగలేదు. ఈ సంస్కరణలు వచ్చాక మనదేశంలో కొంతమంది సామాన్యులు ఎటువంటి కుటుంబ నేపథ్యం కూడా లేకుండా కోట్లకు పడగలెత్తారనేది, విదేశాలలో కూడా ఉన్నత పదవుల్ని అందుకోగలిగారనేది వాస్తవం. ప్రజల ఆదాయాలు, ఆకాంక్షలు కూడా గణనీయంగా పెరిగాయనేది కూడా వాస్తవం. అభివృద్ధి చెందుతున్న దేశం స్థాయి నుంచి మధ్యస్థ ఆదాయ దేశంగా భారత్ రూపుదిద్దుకుంది. అన్నిటికీ లంచాలు, బ్యూరోక్రసీ

ఆటంకాలు లేకుండా తమకు కావలసిన వస్తువుల్ని కొనుక్కోవటం మొదలైంది.

టెలిఫోన్ ఈ సంస్కరణల ప్రభావానికి చక్కటి ఉదాహరణ. 1990ల ముందు ఫోన్ కావాలంటే ఎంపీలు, మంత్రులు రికమెండ్ చేయాల్సి వచ్చేది. జాతీయోద్యమతరం తర్వాత వచ్చిన రాజకీయ నేతలు, బ్రిటీషు వారి అణచివేత ధోరణులకు ప్రతీకలుగా కొనసాగుతున్న బ్యూరోక్రసీ కలిసి ప్రజలకు లైసెన్స్‌రాజ్యంలో నరకం చూపించారు. సంస్కరణలతో ప్రయివేటు కంపెనీలు పోటీలోకి వచ్చాక ఫోన్ కావాలంటే ఎవరి రికమండేషన్ అక్కర్లేదు. పాతికేళ్ల క్రితం ఫోన్ కష్టాల గురించి ఇప్పుడు యువతలో చాలామందికి తెలియను కూడా తెలియకపోవచ్చు. స్వేచ్ఛావాణిజ్యానికి సాంకేతిక పరిజ్ఞానం తోడవటంతో అభివృద్ధి మునుపెన్నడూలేనంత వేగంగా కొత్తపుంతలు తొక్కుతోంది.

అదేసమయంలో ఈ సంస్కరణలు వచ్చాక ఆదాయాల మధ్య అంతరాలు కూడా పెరిగాయని గుర్తించాలి. డబ్బున్నవారికే డబ్బు వచ్చి చేరే ధోరణులు పెరుగుతున్నాయి. క్రోనీ క్యాపిటలిజం (ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం) పెద్దఎత్తున పెరిగింది. రాజకీయాలలో చట్టవిరుద్ధ డబ్బు ప్రభావం విపరీతమై పెద్ద వ్యాపారంగా మారిపోయాయి. ఎన్నికలు పోల్ ఈవెంట్ మేనేజ్‌మెంట్లలా మారాయి. సమాజంలో అశాంతి, ఘర్షణ వైఖరులు పెచ్చరిల్లుతున్నాయి. అప్రకటిత ఎమర్జెన్సీ వాతావరణం రాజ్యమేలుతోంది. గ్రామాలు ఖాళీ అయిపోతున్నాయి. ఆధునిక బానిసలు, నేరాల సంఖ్య పెరుగుతోంది. ఇవన్నీ స్వేచ్ఛా వాణిజ్యం వల్ల కలిగిన దుష్పరిణామాలేనని, ఈ సంస్కరణలేవీ లేకుండానే నెహ్రూ, ఇందిర హయాంలో 5శాతం వరకూ జీడీపీ వృద్ధి రేటు వచ్చిందని, ప్రజలు ఉన్నంతలో సంతోషంగా బతికారని కొందరు బలమైన విమర్శల్ని కొనసాగిస్తున్నారు.

ఇంతకుముందే అనుకున్నట్టు, స్వేచ్ఛా వాణిజ్య సంస్కరణలు అనివార్యంగానే భారత్‌లోకి ప్రవేశించాయి. ఇవి లేకుండా భారత్‌లో వృద్ధి రేటు వచ్చి ఉండొచ్చుగానీ పోటీ ప్రపంచంలో అది కొనసాగాలన్నా, పెరగాలన్నా ఈ సంస్కరణలు తప్పనిసరి. పొరుగు దేశాలు, ప్రపంచం ఈ సంస్కరణల్లోకి వెళ్తుంటే వారితో భారత్ ఏకాకిగా ఉండి పోటీ పడలేదు. చైనా, జపాన్, కొరియా, థాయ్‌లాండ్, తైవాన్ వంటి దేశాల కంటే భారత్ వెనకబడిపోవటానికి ప్రపంచ పోకడలను సరిగా పట్టించుకోకుండా గిరి గీసుకుని ఉండటమే.

ఇప్పుడు భారత్ ముందున్న మార్గం ఒక్కటే. స్వేచ్ఛా వాణిజ్యాన్ని కొనసాగిస్తూనే భారతీయ పరిస్థితుల నేపథ్యంలో దుష్పరిణామాలు రాకుండా సద్వినియోగం చేసే పకడ్బందీ సంస్కరణల్ని తీసుకురావటం.

స్వేచ్ఛా వాణిజ్యం అందరికీ సమానావకాశాల్ని అందిస్తున్నట్టు కనిపిస్తుందిగానీ పేదలకు, వివక్షకు గురైనవారికి అవకాశాలు అందటం తక్కువ. ఈ వైఫల్యాన్ని సరిచేయటానికి అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఎదిగే అవకాశాల్ని అందించాలి. ఈ పని ఎవరు చేయాలి?.. మళ్లీ ఇక్కడ ప్రభుత్వం ఈ ఆధునిక ప్రజాస్వామిక యుగంలో చేయాల్సిన పనులు ఏమిటి? అనే స్పష్టత రావాలి.

ప్రభుత్వం చేయాల్సిన మొట్టమొదటి పని చట్టబద్ధ పాలన. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ తెలిగ్గా న్యాయాన్ని అందించటం. ఆ తర్వాత ప్రజలందరి ఉమ్మడి అవసరాలను తీర్చే రోడ్లు, రవాణా వంటి మౌలిక వసతుల కల్పన. ఆ తర్వాత నాణ్యమైన విద్యను, ఆరోగ్యాన్ని అందరికీ జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందించటం, సర్కారీ కార్యాలయాల్లో ఎటువంటి వేధింపులు, లంచాలు లేకుండా ప్రజలకు రోజువారీ పనులు జరిగేలా చేయటం ప్రభుత్వ బాధ్యత. ఇంత చేసినా కొద్దిశాతం ప్రజలు దారిద్ర్యం నుంచి బైటికి రాలేరు కాబట్టి వారి జీవితాలకు పూర్తి సాయం అందించవచ్చు. ఎంత అభివృద్ధి చెందినదేశంలోనైనా ఇలాంటి వారు 4-5శాతం ఉంటారు. ఇవన్నీ చేశాక అప్పుడు ఇంకా వనరులు ఉంటే ఉచితాల్ని, తాయిలాల్ని ఇచ్చుకోవచ్చు.. అంటే ప్రభుత్వం తాను చేయాల్సిన పనులు చేయకుండా, అందివ్వాల్సిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధ పాలన, సత్వర న్యాయం అందివ్వకుండా ఎన్నికలను ఒక ప్రహసనంగా చేయటం వల్లే స్వేచ్ఛా వాణిజ్యం వల్ల దుష్పరిణామాలు తలెత్తుతున్నాయి, కొద్దిమందికే లాభాలు పరిమితమవుతున్నాయి.

ఒక సరైన సంస్కరణతో స్వేచ్ఛావాణిజ్యం వల్ల తలెత్తిన దుష్పరిణామాన్ని తొలగించి భారీ ఆదాయాన్ని దేశానికి ఎలా ఆర్జించవచ్చో లోక్‌సత్తా 2జీ స్పెక్ట్రం వేలం పాటల ద్వారా నిరూపించింది. విలువైన ప్రకృతి వనరు 2జీ కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగినందున ఆ లైసెన్సుల్ని రద్దు చేసి దేశ వనరుల్ని కాపాడాలని, అదేసమయంలో ఇక ముందు అలాంటి వనరుల కేటాయింపులో బహిరంగ వేలం పద్ధతిని పారదర్శకంగా అమలుచేయాలని దేశంలోని కొందరు పౌరసమాజ ప్రముఖులతో కలిసి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వేలకోట్లతో, బడా బహుళ జాతి వాణిజ్యవేత్తలతో, రాజకీయ నేతలతో, మంత్రులతో ముడిపడిన కుంభకోణంపై అది అత్యంత సాహసోపేతమైన అడుగు. లోక్‌సత్తా వాదనతో సుప్రీంకోర్టు

ఏకీభవించి లైసెన్సుల్ని రద్దు చేయటంతోపాటు ప్రకృతి వనరుల కేటాయింపులో వేలం పాట విధానాన్ని విధిగా ప్రవేశపెట్టాలని తీర్పు ఇచ్చింది. దీంతో దేశానికి అప్పుడు స్పెక్ట్రంలో రూ. 1లక్ష కోట్ల ఆదాయం లభించింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం వేగంగా స్పందించి చర్యలు తీసుకోవటం వల్ల బొగ్గు వేలం పాటల్లో రూ. 3లక్షల కోట్ల పైచిలుకు ఆదాయం వచ్చింది. త్వరలో జరపబోయే స్పెక్ట్రం భారీ వేలంలో రూ. 5లక్షల పైచిలుకు ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అంటే కేవలం ఒక్క సంస్కరణతో భారీ అవినీతిగా పేరుమోసిన ఒక కుంభకోణాన్ని అడ్డుకోవటంతోపాటు ఈదేశానికి రూ. 10లక్షల కోట్ల దాకా ఆదాయాన్ని లోక్‌సత్తా అందించగలిగింది.

వేలం పాటలయ్యాక కూడా అనుకున్నదాని కంటే అతి భారీ ఆదాయం గనక ప్రయివేటు వర్గాలకు వస్తే 'విండ్‌ఫాల్ ప్రాఫిట్' పన్నును కూడా విధించాలని లోక్‌సత్తా ప్రతిపాదిస్తోంది.

స్వేచ్ఛా వాణిజ్యాన్ని దేశానికి కీలకమైన వ్యవసాయం, ఉత్పత్తి, మౌలిక వసతుల రంగాల్లోకి ప్రవేశించనీయకుండా అడ్డుకోవటం ద్వారా నెహ్రూ హయాంలో చేసిన పొరపాటునే సంస్కరణల అనంతర ప్రభుత్వాలూ కొనసాగించాయి. స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రవేశపెట్టటంలో కీలకపాత్ర పోషించిన మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యాక కూడా ఈ రంగాలను సంస్కరించకపోవటం విచిత్రం. ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేసి కేవలం సేవల రంగాన్నే ప్రోత్సహించటం వల్ల పేద, మధ్యతరగతికి ఉద్యోగావకాశాలు దెబ్బతిన్నాయి. ఉద్యోగాలు లేని వృద్ధి రేటు దేశాన్ని ఇప్పటికీ వెనక్కి గుంజుతోంది. మరోవైపు ఐటీ తదితర రంగాల్లో సేవలకు డిమాండ్ పెరిగినా నాణ్యమైన విద్యను నిర్లక్ష్యం చేయటంతో నైపుణ్యమున్న పట్టభద్రులు కరువయ్యారు. అత్యధిక ప్రజలు ఇప్పటికీ ఆధారపడి వున్న వ్యవసాయరంగంలో సంస్కరణల కోసం లోక్‌సత్తా గట్టిగా పోరాడితే ఎట్టకేలకు 2010లో మిగులు ఆహారధాన్యాల ఎగుమతులకు ప్రభుత్వం అనుమతించింది. దీనివల్ల కోటి టన్నుల బియ్యం ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదిగింది. ఫలితంగా, రైతులకు ఆదాయం పెరగటంతోపాటు ప్రభుత్వ ఖజానాకు గణనీయ విదేశీ మారక ద్రవ్యం సమకూరింది. స్వదేశంలో డిమాండ్ ఉన్న పప్పులు, వంటనూనె వంటి వాటి దిగుమతుల మీద భారీగా సుంకం విధించి ఆ డబ్బును రైతులకు ప్రోత్సాహకంగా ఇవ్వాలని, దీనివల్ల ఆ పంటల్లో భారత్ స్వయంసమృద్ధిని సాధించి రైతులకు లాభాలొస్తాయని ఎంతో పోరితే ప్రభుత్వం ఆలస్యంగా అరకొరగా స్పందించింది.

అదేతరహాలో వ్యవసాయరంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) దేశంలో నిర్ద్వంద్వంగా సమర్థించింది బహుశా లోక్‌సత్తా ఒక్కటే. పార్టీలు బైట ఒకటి చెప్పి పార్లమెంటులో ఇంకోలా ప్రవర్తించాయి, కేవలం అధికారపక్షాన్ని ఇరుకున పెట్టటానికి ఎఫ్‌డీఐలను వ్యతిరేకించాయి. ఇలా సంస్కరణలను సమగ్రంగా అమలు చేయకపోవటం, అవసరమైన ముందు జాగ్రత్తల్ని తీసుకోకపోవటం వల్ల పెద్దఎత్తున దుష్పరిణామాలు చోటుచేసుకున్నాయి. నయానో, భయానో సరైన సంస్కరణలు అమలైన చోట సంపద సృష్టి జరిగింది.

సంస్కరణల్ని గుడ్డిగా వ్యతిరేకించటంకాకుండా, వాస్తవాల ఆధారంగా ఏది దేశానికి మేలు, ఇప్పుడున్న పరిస్థితులను మనకు మేలు చేసేలా మార్చుకోవటానికి ఏం చేయాలి అనే స్పష్టత ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీల్లో, పౌరసమాజంలో, ప్రజానీకంలో అవసరం. ఈ స్పష్టత లేకుంటే గుడ్డి నమ్మకాలతో, వాదనలతో కాలం గడిచిపోతుంటుంది, పార్టీలు అధికారంలోకి వస్తుంటాయి పోతుంటాయి గానీ జన జీవితం మాత్రం మారదు. ఈలోగా భారత్‌కున్న ఎదిగే అవకాశాలు తగ్గిపోతాయి. పారిశ్రామిక విప్లవంలా మరో విప్లవాన్ని దేశం కోల్పోవలసి వస్తుంది.

స్థూలంగా ఈదేశంలో ప్రధానంగా మూడు రకాల ఆలోచనా స్రవంతులున్నాయి. ఒకటి, ఈదేశం మారదు అని నిరాశానిస్పృహలకు లోనై సాంప్రదాయ రాజకీయ వ్యవస్థను అడ్డం పెట్టుకుని వీలున్నంత దోచుకుందామనుకునే రకం. ఇది ఒక రకమైన ఆత్మవంచనా, అవకాశవాద ధోరణి కూడా. రెండోది, ఈదేశం మారాలనే బలమైన ఆకాంక్ష ఉంటుందిగానీ ఎలా మారుతుందో తెలియక, వాస్తవాలను ఎదుర్కొనే నిజాయతీ, ధైర్యం లేక భావోద్రేకాలతో సాంప్రదాయ రాజకీయంలోనే కొట్టుమిట్టాడేది. మూడోరకం, రోజువారీ జీవితం తప్ప ఈదేశం గురించి భవిష్యత్తు గురించి పెద్దగా పట్టించుకునే అవకాశం లేనివారికి సంబంధించినది. మూడోరకం వారు ఈదేశంలో ఎక్కువగా ఉన్నారుగానీ, వ్యవస్థను ప్రభావితం చేసేది మొదటి రెండు రకాలవారు. మొదటి రెండు రకాలవారినీ వినియోగించుకుంటూ దిగువస్థాయి ప్రజలలో చైతన్యాన్ని, అవగాహనను తీసుకురావటమొక్కటే ఈదేశానికి సరైన పరిష్కారం. ఇందుకోసం వారిలో అవగాహనను పెంచుతూ ఆశావాదాన్ని, భరోసాను నింపాలి.

నిరాశ, గందరగోళం, భయం, అపోహలు, నిస్సహాయ స్థితుల మధ్య ప్రజలు తమకున్న ఓటు హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛ అనే తిరుగులేని ఆయుధాల్ని ఎంత దుర్వినియోగం చేస్తుంటారో, హేతుబద్ధ సంస్కరణల్ని కూడా ఎలా ఉ

పయోగించుకోలేకపోతుంటారో వ్యక్తిగత అనుభవం నుంచి ఓ చిన్న ఉదాహరణతో చెప్తాను. ఇది వేరే అంశంలా అనిపించొచ్చుగానీ.. ప్రజలు తమ సాధికారతను పరిరక్షించుకునే, పెంపొందించుకునేరీతిలో స్పందిస్తున్నారా లేదా అనేదే ప్రజాస్వామ్యానికి అంతిమ గ్యారంటీ కాబట్టి అంశం ఎన్నికలైనా, స్వేచ్ఛా వాణిజ్యమైనా, మరోటైనా తేడా ఏమీ ఉండదనే భావనతోనే ఈ ఉదాహరణను వివరిస్తున్నాను.

ఈ వ్యాసరచయిత ఈమధ్య విజయవాడ ఓ వ్యక్తిగతమైన ఫంక్షన్‌కి వెళ్లాల్సి వచ్చింది. నేను లోక్‌సత్తా సభ్యుడిని కాకపోయినా నూరుశాతం మద్దతుదారునని తెలుసు కాబట్టి, అక్కడ కొంతమంది బంధుమిత్రులతో పిచ్చాపాటీ మాటల సమావేశంలో లోక్‌సత్తా ప్రస్తావన వచ్చింది. అక్కడున్నవారంతా తెలుగుదేశం అభిమానులు. వారిలో ఎక్కువమంది చంద్రబాబు సామాజికవర్గానికి చెందినవారే. లోక్‌సత్తా పార్టీ ఎన్నికలలో పోటీ చేయనని ప్రకటించినట్టుంది అని సమావేశంలో మాటల్ని లీడ్ చేస్తున్న ఓ ఎన్నారై అడిగాడు. ఆయన అమెరికాలో చాలాకాలం పనిచేసి రిటైరయ్యారు. ఆయన పిల్లలు వైద్యులుగా, ఇతర రంగాల్లో పెద్ద ఉద్యోగులుగా అక్కడే సెటిలయ్యారు. ఇప్పుడు ఆయన ఆరు నెలలు యూఎస్‌లో ఆరు నెలలు విజయవాడలో ఉంటున్నారు. లోక్‌సత్తా పార్టీ గురించి ఇతర వార్తలను ఎప్పుడూ ప్రస్తావించకుండా కేవలం ఎన్నికల్లో పోటీకి తాత్కాలిక విరామం ఇచ్చిన అంశాన్ని గురించి మాత్రం అడుగుతున్న చాలామందిలాగానే ఆయనా ప్రశ్నించారు.

'ఇది కేవలం తాత్కాలికమే, చెప్పుకోదగిన ఓట్లు వస్తాయనుకున్నప్పుడు మళ్లీ పోటీకి లోక్‌సత్తా సిద్ధమే' అని చెప్పాను. ఆ తర్వాత అమరావతి ప్రస్తావన వచ్చింది. ఆ అభివృద్ధి నమూనా తప్పు అన్నాను. దాంతో ఆ ఎన్నారై, చుట్టుపక్కల వాళ్లు పేట్రేగిపోయారు. '2009లో జేపీ వల్ల చంద్రబాబు ఓడిపోవటంతోనే ఇదంతా వచ్చింది. తెలుగుదేశానికి నష్టం చేయటానికే లోక్‌సత్తా ఉంది. హైదరాబాద్‌లాంటి రాజధాని మాకు అక్కర్లేదా?' అంటూ చుట్టుముట్టారు.

'ప్రజలు ఒక్కళ్లకే ఓట్లు వేస్తే ఇంక ప్రజాస్వామ్యం ఎందుకు? పార్టీలు, ఓట్లు ఎవరి సొంత ఎస్టేట్లు కావు. హైదరాబాద్‌లో చేసింది కరెక్టు కాదు కాబట్టే ఆ తప్పును అమరావతిలో చేయకుండా అభివృద్ధిని, అధికారాన్ని వికేంద్రీకరించమని చెబుతోంది లోక్‌సత్తా' అన్నాను.

ఎన్నారై గొంతు సవరించుకుని, న్యూయార్క్ గురించి చెప్పారు. 'న్యూయార్క్ ఎందుకు డ్రీమ్ సిటీ అంటే అక్కడ ఐక్యరాజ్యసమితి సహా అన్నిరకాల సంస్థలూ ఉన్నాయి' అంటూ ఏకరువు పెట్టారు. అదే తరహాలో అన్ని రకాల సంస్థల్నీ, కార్యాలయాల్నీ, కర్మాగారాల్నీ అమరావతిలో చుట్టుపక్కల ఏర్పాటు చేస్తేనే అభివృద్ధి సాధ్యమని, ఆంధ్రప్రదేశ్ భారతదేశానికి తూర్పు వాణిజ్య ముఖద్వారం కావాలంటే చంద్రబాబు విజనే కరెక్టు అని తేల్చాడాయన.

'అయ్యా, న్యూయార్క్ నగరం రాష్ట్ర రాజధాని కాదు, ఆ రాష్ట్రానికి రాజధాని అల్బనీ అని ఎవరికీ పెద్దగా తెలియని పట్టణం. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాజధాని చుట్టూ అంతా కేంద్రీకరించకుండా, రాజధానేతర నగరాలను అభివృద్ధి చేయాలని లోక్‌సత్తా కోరుతోంది' అని ఆయన తప్పును సున్నితంగానే స్ఫురింపచేస్తూ అన్నా. ఆయనకు తన తప్పు అర్థమై కూడా మాట మార్చి .. అది అమెరికా మోడల్, ఇది ఇండియా మోడల్ అని దబాయింపునకు దిగాడు. క్వాంటమ్ ఫిజిక్స్ గురించి, ఇతర గ్రహాల్లో, సౌరవ్యవస్థల్లో పరిస్థితుల గురించి అలవోకగా మాట్లాడుతున్న ఆ ఎన్నారై, సాటి మనిషిని ఈ విశ్వంలో తనలాంటి భాగంగా గుర్తించి సమస్యలను పరిష్కరించాలనుకోకపోవటం నిరుత్సాహాన్ని కలిగించింది. ఆధునిక జీవితం ఉన్నంత మాత్రాన ఆధునిక ఆలోచనా తీరును సాధించలేరనిపించింది.

వాదన కొనసాగి.. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఎన్నికలు లేకుండా 20ఏళ్లు అధికారంలో ఉంటే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయని వాళ్లంతా తేల్చారు. పేదలు, అణగారిన వర్గాలు ప్రజాస్వామ్యాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టమొచ్చినట్టు ఓట్లు వేస్తే నష్టపోక తప్పదని, లోక్‌సత్తా చెప్పినట్టు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం సాధ్యం కాదని అన్నారు.

'అసెంబ్లీలో తనపై దాడి చేసిన వాడిని ఏమీ చేయని జేపీ ఆంధ్రావాళ్లకు ఏం చేస్తాడని' ఒకరన్నారు. 'తెలంగాణ అవసరం, అనివార్యం అని ధైర్యంగా ప్రకటించి రాష్ట్రం విడిపోతే ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో అసెంబ్లీలో చెప్పింది జేపీ తప్ప రాష్ట్రాన్ని విడగొట్టమని లేఖ ఇచ్చిన చంద్రబాబు కాదు, ఎవరు నిజమైన నాయకుడో అందరికీ తెలుసు' అన్నాను. 'అలా తెలంగాణ ఇవ్వాలని చంద్రబాబు చెబితే ఎన్నికల్లో గెలవడు, జేపీలాగానే ఓడిపోయి ఉండేవాడు' అని ఒకాయన అన్నాడు. కులరాజకీయాలకు వ్యతిరేకంగా జేపీ ఆడియో క్లిప్పింగు కోస్తా జిల్లాల్లో దాదాపు ప్రతి సెల్‌ఫోన్‌కీ చేరిందని వాళ్ల అక్కసు చూశాక నాకు గుర్తొచ్చింది. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి, సామాన్య యువతకు ఉద్యోగాల గురించి జేపీ పదేపదే ప్రశ్నిస్తుండటం కూడా అధికార పిచ్చిలో ఉన్నవారికి ఇబ్బందిగా మారిందనిపించింది. ఇక మరీ వాదనలు చేస్తే నా మీద భౌతికదాడికి దిగేట్టున్నారు,

దాంతోపాటు ఫంక్షన్ వాతావరణం దెబ్బతినేట్టుంది అనుకుని నేను మౌనం వహించాను.

ఆ తర్వాత నాతో వాదించిన వారితో వేర్వేరుగా మాట్లాడే అవకాశం వచ్చింది. 'ఇందాకటి ఆర్గ్యుమెంట్‌ను పట్టించుకోబాకు. జేపీ చెప్పింది వాస్తవం. నేను ఆయన్ని పర్సనల్‌గా కూడా కలిశాను. చాలా సింపుల్‌గా డాంబికాలు లేకుండా ఉన్నాడు. అలాంటి నాయకులు గెలిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది' అని ఒకతను అన్నాడు. ఇంకో అతను కూడా దాదాపు అలాగే మాట్లాడి, 'లోక్‌సత్తాకు సంస్థాగత బలం లేదు, ఉందుంటే కచ్చితంగా ఓట్లు వేస్తాం' అన్నాడు. 'జేపీ చెప్పినవి జరగాలంటే చాలా ఏళ్లు పడుతుంది, ఈలోగా తప్పదు కాబట్టి తెదేపాలాంటి పార్టీలకు ఓట్లు వేస్తున్నాం' అని మరో అతను అన్నాడు.

చివరికి నాకు అర్థమైందేమంటే, నిరాశతోనో, సేవాభావం లేకో కొద్దిమంది ఉద్దేశపూర్వకంగా దేశానికి నష్టం చేసే విధానాలను ప్రోత్సహిస్తున్నారు తప్ప మిగిలినవారికి సరైన అవగాహన, కాస్త భరోసా ఇస్తే దేశంలో మార్పు సాధ్యమవుతుంది, వేగంగా అభివృద్ధి చెందగలుగుతుంది. ఆశావాదాన్ని, ఆచరణాత్మక భాగస్వామ్యాన్ని పెంచగలిగి, కిందిస్థాయిలోని మెజారిటీ ప్రజల ఓట్లు పడతాయి అని తెలియచేయగలిగితే మొదటి ప్రభావశీలమైన వర్గాన్ని కూడా చాలామేరకు మార్చవచ్చు. ఈ లోపాన్ని సరిచేయటానికి ఓటు వేస్తు అనే భావనను సృష్టించే మన ఎన్నికల వ్యవస్థ కూడా అవరోధంగా ఉంది.

'తెదేపాకో, మరోపార్టీకో వ్యతిరేకంగా పనిగట్టుకుని వెళ్లటం కోసం కాదు లోక్‌సత్తా వచ్చింది. 2014 ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి జేపీ గనక గెలిచినట్లయితే తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో దుస్థితి పట్టి ఉండేది కాదు, తెలుగు రాష్ట్రాలకు, ఈదేశానికి కూడా గొప్ప మేలు జరిగివుండేది. తెదేపా ఒకేసారి కొత్తరాజకీయాన్ని పాటించి ఓడిపోవాలని లోక్‌సత్తా చెప్పలేదు, లోక్‌సత్తా గెలుపునకు ఎంపికచేసిన చోట్ల తెదేపానో, మరో సాంప్రదాయ పార్టీనో సహకరించి ఉంటే ఆ పార్టీలకూ ఎదుగుదలకు అవకాశాలు పెరిగేవి, లోక్‌సత్తా కూడా తన లక్ష్యం దిశగా కొన్ని అడుగులు వేయగలిగేది అన్నాను. కొత్తదనం వద్దనుకుంటే ఎంత ప్రధానపార్టీ అయినా క్రమంగా అంతరించిపోవాల్సిందే. ఈవేళ తెలంగాణలో తెదేపా ఎందుకు? కమ్యూనిస్టులు చేయాల్సిన పనుల్ని కేసీఆర్ చేసేశారు కాబట్టి ఆ పార్టీలు అనవసరం అంటున్నారుగానీ.. లోక్‌సత్తా ఎందుకు, లోక్‌సత్తా చేయాల్సిన పనుల్ని చేసేశాం అని ఎవరూ అనలేకపోతున్నారు' అన్నాను.

'అలాగే జేపీ మీద అసెంబ్లీలో దాడి సాధారణంగా జరిగివుంటే మరోమాట లేకుండా కఠిన చర్యలుండేవి. సాక్ష్యాలకు కొదవ లేదు. కానీ ఆ చర్యలకు అంగీకరించక పోవటంతో పాటు ఎదురుదాడులకు సిద్ధమైనవారిని కూడా జేపీ నియంత్రించటానికి కారణం.. ఒక ఉద్యమంలో భాగంగా తాత్కాలిక ఆవేశంతో దాడి చేయటం, ఆ తర్వాత పశ్చాత్తాపంతో వాళ్లు క్షమాపణ కోరటం. ఈ విషయంలో జేపీ ఎంతో వేదనని అధిగమించి అసాధారణ సంయమనంతో హుందాగా వ్యవహరించారు. అది ఆయన స్థాయిని పెంచింది తప్ప తగ్గించలేదు. అలా చేయకుండా తొడలు కొట్టే రీతిలో వ్యవహరించి ఉంటే ఆయన తాత్కాలికంగా హీరో అయి 2014 ఎన్నికల్లో గెలిచివుండేవారేమోగానీ దీర్ఘకాలిక ప్రజాప్రయోజనాలు, లోక్‌సత్తా లక్ష్యాలు దెబ్బతినేవి' అని వివరించాను. ఇక 'సంస్థాగతంగా లోక్‌సత్తా బలోపేత మవటానికి తగినన్ని వనరులు, స్వావలంబన ఉన్నవారు సమాజం నుంచి తగురీతిలో నిలకడగా స్పందించకపోవటం ఇందుకు తక్షణ కారణం. అసలు మీబోటి వాళ్లంతా ఓట్లు వేసి వుంటే ఎవరొచ్చినా రాకున్నా ఆటోమేటిక్‌గా లోక్‌సత్తా పెద్ద పార్టీగా మారిపోయి సమస్య పరిష్కారమైపోయి ఉండేది. పార్టీలు పెద్దవి, చిన్నవి ఉండవు. ప్రజల్లో మద్దతే ఏ పార్టీనైనా పెద్ద పార్టీ చేస్తుంది. అది ప్రజలు గ్రహించి ఓటు వేయటం మొదలు పెడితే లోక్‌సత్తా వెంటనే పెద్ద పార్టీగా అవతరిస్తుంది" అని ఒక్కొక్కరికీ ఓపిగ్గా వివరించాను. 'కులరాజకీయాలను నిర్మూలించుకోకపోతే రాబోయేకాలంలో నష్టపోయేది మీరే గదా, మనిషికో పోలీసును పెట్టి ఎవరూ ప్రజలని రక్షించలేరు. ఏ కులంలో పుట్టాలో మన చేతుల్లో లేదు. పుట్టాక ఆ కులం వాళ్లే చుట్టుపక్కల ఎక్కువగా ఉంటారు. వారిని పట్టించుకోవటం, వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నించటం కూడా తప్పు కాదు. వాళ్లూ మనుషులేగా. కానీ అక్కడికే పరిమితమై, ఆ కులమే అంతిమమన్నట్టుకులాన్ని ఘనీభవింప చేయటం మాత్రం క్షమార్హం కాదు. నిజానికి కుల పిచ్చి నుంచి బైటపడి ఆలోచిస్తే.. ఏ లాభం లేకుండా కులపోడు కాబట్టి అని చేసే సాయం పెద్దగా కనిపించదు. అందువల్ల కుల రాజకీయాల నుంచి బైటపడి వాస్తవాల ఆధారంగా మనుషులను అంచనా వేయండి. అందరి ప్రయోజనాలలో భాగంగా మీ ప్రయోజనాలను సాధించుకోవటం మొదలెట్టండి' అన్నాను.

వాళ్లు ఇబ్బందికరంగా ముఖం పెట్టినా వాళ్లకు తెలియాల్సిన విషయాల్ని నేను ఆపకుండా కొనసాగించాను.

'మనకు నరేంద్ర మోదీ, చంద్రబాబు, కేసీఆర్, పవన్ కళ్యాణ్, జేపీ కాదు ముఖ్యం.. మన జీవితాలు, మన భవిష్యత్తు

మాత్రమే ముఖ్యం. ఎన్నికలు లేకుండా ఎవరో నియంతల్లా పరిపాలిస్తే మార్పు రాదు. జర్మనీ, జపాన్, బ్రిటన్, అమెరికా వంటి దేశాల్లో 20 ఏళ్లు ఎన్నికలు లేకుండా నియంతృత్వ పాలనేమీ లేదు. అయినా ఆ దేశాలు ఎలా అభివృద్ధి చెందాయి? మనకు సరైన సానుకూల ఆలోచనాతీరు ఉండి అవగాహన పెంచుకుంటే ప్రజాస్వామ్యం ద్వారానే గొప్ప సంస్కరణల్ని సాధించుకోవచ్చు. అందుకోసం వాస్తవాల ఆధారంగా ఆలోచించండి, రాజకీయాలు చేయండి, ఓట్లు వేయండి. అది మాత్రమే నేను చెప్పదల్చుకున్నది. నా మట్టుకు నాకు అత్యంత సంతోషంగా అనిపించిన సందర్భాలలో నేను లోక్‌సత్తాకు ఓటు వేసిన ఓటు వేయటం ఒకటి.. ఆలోచించండి' అన్నాను. ఊగిసలాడుతూనే అంగీకరించారు.

ఇది ఒక చిన్న ఉదంతమే కావచ్చు, కానీ వాస్తవాల ఆధారంగా ప్రజలలో అవగాహన పెంచటం, నిరాశావాదాన్ని, భయాల్ని పారదోలటం, రాజకీయాలలో, పాలనలో వారి భాగస్వామ్యాన్ని పెంచటం లేకుండా ఈదేశంలో సరైన విధానాలను అమలు చేయలేం, ఎన్నికల్లో సరైన అభ్యర్థుల్ని, పార్టీల్ని ఎన్నుకోలేం అని స్పష్టంగా తెలియచెబుతుంది.

ఈవేళ తప్పులు చేసి రేపు మంచి జరుగుతుందని ఆశించే ధోరణి వల్ల నష్టపోతారని ప్రజలకు వివరించాలి. విష బీజాలు నాటితే విషఫలాలే వస్తాయి, అమృత ఫలాలు రావాలంటే అమృత బీజాల్నే నాటాలి అనే స్పష్టతను వారిలో నాటాలి. సమర్థులు, నిజాయతీపరులు నాయకత్వ స్థానాలకు వేగంగా ఎదిగేలా చేయాలి.

ఈ క్రమంలోనే దేశాభివృద్ధిని మౌలికంగా ప్రభావితం చేస్తున్న ఆర్థిక సంస్కరణల గురించి పిడివాదం చేయకుండా స్పష్టమైన అవగాహనతో, వాస్తవిక దృష్టితో వ్యవహరించేలా, ఈదేశంలో మెజారిటీ ప్రజానీకం, ముఖ్యంగా ఆలోచనాపరులు, మధ్యతరగతి, యువత స్థూల ఏకాభిప్రాయానికి వచ్చేలా చేయాలి.

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈవేళ చిన్నచిన్న పనులతోనే పెద్దపెద్ద ఫలితాలు సాధిస్తున్నాం అని చెప్పటం వెనక స్వేచ్ఛా వాణిజ్య సంస్కరణల కోసం పెద్ద ప్రయత్నాల్ని పీవీ నరసింహారావు దగ్గర్నుంచి చేశారని మనం గుర్తించాలి. అంతర్జాతీయంగా పెట్రో ధరల క్షీణత వంటి యాదృచ్ఛిక అంశాలూ కలిసొచ్చాయి. అయినా.. అవినీతి లేకుండా సమర్థవంతంగా పెద్దపనులు చేయమని ప్రజలు మోదీని ఎన్నుకున్నారు తప్ప అవినీతి జరుగుతుందనే భయంతో చిన్నపనులకే పరిమితమవ్వమని కాదు.

"భారత్‌లో పేదరికాన్ని నిర్మూలించి ప్రజల జీవన ప్రమాణాలను, ఆదాయాలను వేగంగా, సుస్థిరంగా పెంచటం, భారత్‌ను ప్రపంచంలో అగ్రగామి దేశంగా నిలపటం ఆర్థిక సంస్కరణల ప్రాథమిక లక్ష్యం. ఒక తరం కాలంలో తూర్పు ఆసియా దేశాలు సమూల మార్పును సాధించుకున్నాయి. చైనా, ఇండొనేషియా, కొరియా, మలేషియా, థాయ్‌లాండ్ మనకంటే ఎక్కువ జీవన ప్రమాణాల్ని సాధించాయి. వాళ్లు సాధించిన వాటి కోసం మనం ప్రయత్నం ప్రారంభిస్తున్నాం" అని సంకల్పం చెప్పుకుని స్వేచ్ఛా వాణిజ్య సంస్కరణల్ని పాతికేళ్ల క్రితం ప్రారంభించారు. మన ప్రమేయంలేని ప్రపంచీకరణ నేపథ్యంలో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఒక అవకాశంగా మలుచుకోవాలని, అందుకోసం ఈ దిగువ సంస్కరణల అమలుకు పాలకులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని లోక్‌సత్తా విజ్ఞప్తి చేస్తోంది:

చట్టబద్ధ పాలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చైనా వంటి దేశాలలో వచ్చిన ఆర్థిక మార్పుల్ని ఉపయోగించుకుంటూ ఉద్యోగాల సృష్టి, ప్రజలు రోజువారీ పనుల కోసం ఎవరి దయాదాక్షిణ్యాల మీదా ఆధారపడాల్సిన అవసరం లేకుండా స్థానిక ప్రభుత్వాలకు సాధికారత, వార్డు స్థాయికి అధికార వికేంద్రీకరణ, రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి, రాష్ట్రాల్లో ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం, జాతీయ స్థాయిలో దామాషా ఎన్నికల పద్ధతి, ఉన్నతస్థాయి అవినీతి నియంత్రణకు దర్యాప్తు సంస్థలకు జవాబుదారీతనంతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తి, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, వేధింపులు లేకుండా ప్రజలకు సేవలందించేందుకు సర్వీస్ గ్యారంటీ చట్టం, ప్రభుత్వోద్యోగంలో చేరటమే తప్ప తొలగించటం ఉండదు అనే విధానానికి స్వస్తిచెప్పి రేటింగ్ ఆధారంగా సర్వీస్‌ను నిర్ణయించటం, అసంఘటిత కార్మికులను సంఘటిత రంగంలోకి తెచ్చేలా కార్మిక సంస్కరణలు, ఐఏఎస్ సహా వివిధ ఉన్నతస్థాయి ఉద్యోగాలలో సమాజంలోని వివిధ రంగాల నిష్ణాతుల సేవలను కూడా పరిమితకాలం వినియోగించుకోవటం, సహకార వ్యవస్థను బలోపేతం చేయటం, పోలీసు, న్యాయ వ్యవస్థల ప్రక్షాళన, పర్యావరణ పరిరక్షణ తదితర సంస్కరణలను మనం ఎంత వేగంగా సాధించుకోవాలి. శతాబ్దాల కుల వివక్ష నిర్మూలనకు అదనంగా సామాజిక చైతన్య పోరాటం చేయాలి. వీటిలో ప్రతి అంశానికీ తగిన పునాదిని పరిష్కారాలతో సహా లోక్‌సత్తా ఇప్పటికే నిర్మించింది. ఈ సంస్కరణలుంటే, అపార యువశక్తి, సాంకేతిక పరిజ్ఞానం, వేల ఏళ్ల విశిష్ట సంస్కృతి ఉన్న భారత్ స్వేచ్ఛా వాణిజ్య సంస్కరణల్ని ఒక అవకాశంగా వినియోగించుకుని మనం ఆశిస్తున్న ఉన్నతస్థాయి కక్ష్యలోకి ప్రవేశించగలుగుతుంది. ◘

**గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు**

*Best Compliments*

భారతదేశంలో ఉత్తమ సేవాసంస్థగా పలు అవార్డులు పొందిన

# అసిస్ట్ స్వచ్ఛంధ సేవా సంస్థ

## H.O. చిలకలూరిపేట

ఆంధ్రప్రదేశ్‌లో అసిస్ట్ సేవాసంస్థ ద్వారా నిరుపేదలకు

- ఉచితంగా పక్కా గృహాలు నిర్మించడం
- పాఠశాలలు ఏర్పాటు
- హాస్టల్ వసతులతో విద్యార్థులను తీర్చిదిద్దటం
- రైతులకు వ్యవసాయంలో సహాయం చేస్తూ, పంట పొలాలకు, కాలువలపై చెక్ డ్యాంల నిర్మాణం
- పాడి పరిశ్రమను అభివృద్ధి చేయటం
- సునామీ బాధితులకు పడవలు, వలలు పక్కాగృహాలు ఏర్పాటు చేయటం
- పేదలకు మరుగుదొడ్లు నిర్మించటం
- మేలుకొలుపు టీం ద్వారా ప్రజలకు విద్యా, ఆరోగ్యంపై అవగాహన కల్పించటం


**జాష్టి రంగారావు**

డైరెక్టర్

చిలకలూరిపేట

# ఆర్థిక సంస్కరణలు కాదు, ప్రభుత్వ పాత్ర మారకపోవటమే సమస్య

- డా॥ జయప్రకాష్ నారాయణ్




కొద్దివారాలుగా దేశ ఆర్థిక విధానాలను గురించిన చర్చ జోరుగా సాగుతోంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణలపైన చెలరేగిన వివాదం చివరకు కేంద్ర మంత్రివర్గంలో బహిరంగ విభేదాలకు దారితీసింది. సీనియర్ మంత్రులు జార్జి ఫెర్నాండెజ్, మురళీమనోహర్ జోషి, రాంనాయక్ కలిసి ఓ కూటమిగా ఏర్పడి ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తున్నారని స్పష్టమయింది. ప్రధానమంత్రి వాజ్‌పేయి ఆర్థిక సంస్కరణలను నిర్ద్వంద్వంగా సమర్థిస్తూ ప్రకటన చేయడంతో ఈ విభేదాలు తారాస్థాయికి చేరాయి. అదే సమయంలో ఆర్ఎస్ఎస్ అధినేత సుదర్శన్ విదేశీ పెట్టుబడులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ప్రకటన చేయటంతో మన ఆర్థిక విధానాలపై అనిశ్చితి ఏర్పడింది. ఈ వివాదం వల్ల ప్రభుత్వ సుస్థిరతకు ఢోకా లేకపోవచ్చు, కానీ ప్రభుత్వం నిలవటం కంటే ఆర్థిక విధానాలలో స్పష్టత, దీర్ఘకాల సుస్థిరత, విశ్వసనీయత ఉండటం మన దేశ ప్రగతికి అత్యవసరం. ఈ నేపథ్యంలో ఈ వివాదం వెనక ఉన్న కీలకమయిన అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది.

### కఠోర వాస్తవాలు

1991 ఆర్థిక సంస్కరణలను చేపట్టిన నాటి నుంచి మన

ఆర్థిక విధానాలపైన దుమారం చెలరేగుతూనే ఉంది. ఈ వివాదం మాటున కొన్ని కఠోర వాస్తవాలు మరుగున పడిపోయాయి. సంస్కరణలను, స్వేచ్ఛా వాణిజ్యాన్ని సమర్థిస్తున్న వారూ– వ్యతిరేకిస్తున్నవారూ.. ఈ రెండు వర్గాల వారూ తమ వాదనలలో ప్రభుత్వ పాత్ర తగ్గిపోవాలని, తగ్గిపోతుందని భావిస్తున్నారు. వారి సిద్ధాంతాలు మార్గాలు వేరయినా, వాస్తవాలను విశ్లేషించటంలో ఇరువర్గాల వారూ తప్పిదం చేస్తున్నారు. నిజానికి భారత్‌లో ప్రభుత్వం పాత్ర ప్రపంచంలోని మిగతా దేశాలతో పోలిస్తే తక్కువగానే ఉంది. అభివృద్ధి చెందిన దేశాలలో ప్రభుత్వం పెట్టే ఖర్చు వాటి జాతీయాదాయంలో సగటున 45శాతం ఉంది. చివరికి స్వేచ్ఛా వాణిజ్యానికి, వ్యక్తి స్వాతంత్ర్యానికి ప్రతీకగా నిలిచిన అమెరికా లాంటి దేశంలో కూడా ప్రభుత్వం ఖర్చు జాతీయాదాయంలో 38శాతం ఉంది. సంపన్న దేశాలన్నింటిలోనూ మొత్తం మీద పన్నుల వసూళ్లు, ప్రభుత్వం వ్యయం సమానంగా ఉన్నాయి. మనదేశంలో చూస్తే– పన్నుల వాటా జాతీయాదాయంలో కేవలం 18శాతం ఉండగా, ప్రభుత్వం పెట్టే ఖర్చు 29శాతం ఉంది. ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా పెట్టటంతో.. అయితే అప్పులు, లేకపోతే కరెన్సీ ముద్రణ అవసరమవుతున్నాయి. దానినే ద్రవ్యలోటు అంటున్నాం. ఆర్థిక సంస్కరణలు ప్రారంభించాక క్రమక్రమంగా కరెన్సీ ముద్రణ ద్వారా బడ్జెట్ లోటును భర్తీ చేయటం ఆగిపోయింది. కాబట్టి ద్రవ్యలోటును పూరించటానికి అప్పులు చేయవలసి వస్తోంది. అంటే జాతీయాదాయంలో 11శాతం మేర ప్రతి ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. ఇంత చేసినా ప్రభుత్వ వ్యయం పెట్టుబడిదారీ దేశాలలో పెట్టే ఖర్చు కన్నా చాలా తక్కువగా ఉంది. వారి జాతీయాదాయం ఎక్కువ కావటం వల్ల, ఆ దేశాలలో ప్రభుత్వ వ్యయం మనకంటే ఎక్కువగా ఉండటంలో ఆశ్చర్యం లేదు. కానీ ఆయా దేశాల జాతీయాదాయాలలో ప్రభుత్వ వ్యయం వాటాను అంచనా వేస్తే, అప్పుడు వివిధ దేశాల మధ్య పోలిక అర్థవంతంగా ఉంటుంది.

ఆ రకంగా పోల్చినప్పుడు ప్రభుత్వం పాత్ర పరిమితంగా ఉన్న దేశాలలో కన్నా మనదేశంలోని ప్రభుత్వ వ్యయం దాదాపు 16శాతం తక్కువగా ఉంది! అందుకే ప్రభుత్వం నుంచి మనం ఆశించిన సేవలు, ప్రజాప్రయోజనాలు, ఉమ్మడి సౌకర్యాలు మనకు అందటం లేదు. దేశంలో ప్రస్తుతం అక్షరాస్యత 65శాతం మాత్రమే ఉంది. కాస్త లోతుగా పరిశీలిస్తే ఈ లెక్క కూడా అంత నమ్మదగ్గది కాదు. నిజమైన అక్షరజ్ఞానం అంటే రాయటం, చదవడం తెలియటం, అంక గణిత పరిజ్ఞానం ఉండటంగా పరిగణిస్తే, మన జనాభాలో 25–30శాతానికి మాత్రమే అక్షర జ్ఞానం ఉంది. ఆధునిక యుగంలో పౌరుడు సగర్వంగా తలెత్తుకు తిరగాలన్నా, ఒక వ్యక్తి శక్తిసామర్థ్యాలు వికసించాలన్నా, తన కాళ్ల మీద తాను నిలబడాలన్నా, సంపదను సృష్టించాలన్నా, ఉపాధి పొందాలన్నా కనీసం నాలుగయిదేళ్ల పాటు మంచి ప్రమాణాలతో పాఠశాల విద్యను అభ్యసించాలని నిపుణులంతా స్పష్టంగా చెబుతున్నారు. అంటే అందరికీ మంచి ప్రమాణాలతో కూడిన పాఠశాల విద్య అందటమనేది బీదరికాన్ని పారదోలటానికి, సాంఘిక సమానత్వాన్ని సాధించటానికి అత్యంత కీలకమయిన అవసరం. విద్యతో బడుగు వర్గాల ప్రతిభాపాటవాలు వికసించి సంపద సృష్టిలో వారి పాత్ర గణనీయంగా పెరుగుతుంది. కరెన్సీ నోట్లను ముద్రించి అందరికీ పంచితే బీదరికం పోదు. ఉత్పత్తిని పెంచి తిండి, గుడ్డ, ఇల్లు ఇతర అవసరాలు తీరిస్తేనే బీదరికం పోతుంది. అందరికీ అక్షరజ్ఞానం అందితేనే సాంఘిక సమానత్వం సాధ్యమవుతుంది. అయితే అది తూతూ మంత్రంగా కాకుండా, నిజంగా మేధస్సు వికసించేలా కనీస ప్రమాణాలతో కూడిన విద్య అయి ఉండాలి.

### అంధకారంలో ఆధునిక భారతం

వైద్య, ఆరోగ్య రంగాలలో సాధించిన ప్రగతి పుణ్యమా అని ప్రపంచంలోని సంపన్న దేశాల్లో సగటు జీవనకాలం 75 సంవత్సరాలు దాటుతోంది. దాదాపు అన్ని అంటువ్యాధులకూ మందులు అమలులోకి వచ్చాయి. మనదేశంలో కూడా 50 ఏళ్ల క్రితం 32 సంవత్సరాలున్న సగటు జీవనకాలం ప్రస్తుతం 65 సంవత్సరాలకు చేరింది. కానీ నేటికీ బీదలకు ఆరోగ్యం అందని మానిపండే. మన సమాజంలో బీదలు రుణాల ఊబిలో కూరుకుపోవటానికి, దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోవడానికి అనారోగ్యం ప్రధాన కారణం. నేటికీ మనదేశంలో కేవలం 32శాతం మంది పిల్లలకు మాత్రమే కనీస స్థాయిలో వ్యాధి నిరోధక టీకాలు అందుతున్నాయి. అంటే 68 శాతం మంది పిల్లలకు సులభంగా నివారించదగ్గ వ్యాధుల నుంచి రక్షణ లేదన్న మాట! అలాగే కేవలం 28శాతం మందికి మాత్రమే సరైన మరుగుదొడ్ల సౌకర్యం ఉంది. అలాగని మనదేశంలో ఆరోగ్యం మీద పెట్టే ఖర్చు అంత తక్కువేమీ కాదు. దాదాపు

5.1శాతం జాతీయాదాయాన్ని ఆరోగ్యం కోసం మనం ఖర్చు చేస్తున్నాం. కానీ, దానిలో ప్రభుత్వం వాటా కేవలం 0.9శాతం మాత్రమే. అంటే మొత్తం ఆరోగ్య వ్యయంలో 18శాతం మాత్రమే. ప్రజారోగ్యం మీద ప్రభుత్వం అతితక్కువ వ్యయం చేస్తున్న దేశాలలో భారత్ ఒకటి. మరో ఐదు దేశాలలో మాత్రమే ఆరోగ్య విషయంలో ప్రభుత్వ పాత్ర మనకంటే తక్కువగా ఉంది. సంక్షేమ రాజ్యం, అందరికీ సాంఘిక న్యాయం అందించటాన్ని రాజ్యాంగ లక్ష్యంగా నిర్దేశించుకున్న దేశంగా మనం ఇంత వెనకబడి ఉండటం అత్యంత లజ్జాకరమైన విషాదభరితమైన విషయం. అమల్లో ఉన్న ఆరోగ్య వసతులు కూడా బీదలకు అందటం దుర్లభమవుతోంది. ఉదాహరణకు ప్రభుత్వం చేసే కొద్దిపాటి ఖర్చులో కూడా 60శాతం కేవలం ఆసుపత్రులకు వైద్యసౌకర్యాలకు అందుతోంది. వ్యాధి నివారణకు, ఆరోగ్య సేవలకు వెచ్చిస్తోంది 26శాతం మాత్రమే. ప్రపంచం మొత్తం మీద సర్వేలలో తేలిందేమంటే.. వైద్య సౌకర్యాలు ఎప్పుడూ సంపన్నులకు, మధ్యతరగతి వారికే ఉపయోగపడతాయి. ప్రభుత్వ ఆరోగ్య సేవలు, వ్యాధి నివారణ పద్ధతులు మాత్రమే పేదలకు అందుతాయి. ఈ కారణాల వల్ల బీదలు నివారించదగ్గ వ్యాధులకు కూడా సులభంగా లొంగిపోతున్నారు. చిన్నచిన్న రోగాలు, తేలికగా చికిత్సకు లొంగే వ్యాధులు సోకినప్పుడు కూడా బీదలకు కనీస వైద్యం కరువవుతోంది. ఉదాహరణకు మలేరియా జ్వరం సోకితే సంపన్నుల కన్నా బీదలకు ఖర్చు ఎక్కువవుతోంది. అనారోగ్యం ముదిరిపోతోంది. ఎక్కువ బాధను అనుభవిస్తున్నారు. విలువైన కాలాన్ని, జీవన భృతిని కోల్పోతున్నారు. కొన్ని సందర్భాలలో సకాలంలో సరైన చికిత్స లేక ప్రాణాలే పోగొట్టుకుంటున్నాదిరి. 21వ శతాబ్దంలో సామాన్యులకు ఇంతకంటే అన్యాయం మరొకటి ఉండదు. ఇక ఆధునిక సమాజంలో బీదవర్గాలకు అందవలసిన మరో కనీస సౌకర్యం సాంఘిక భద్రత. వ్యక్తి ఎంతగా శ్రమించటానికి సిద్ధపడినా ఉపాధి అందరికీ, అన్ని సందర్భాలలో దొరకదు. అది ఆ వ్యక్తి తప్పు కాదు. కేవలం బీదరికం కారణంగా అలాంటి నిరుద్యోగులు పస్తులుండటం సమాజానికి శాపం. అలాగే వయసు మళ్లిన వృద్ధులు, ఏ అండా లేని వితంతువులు, ఆలనపాలన లేని అనాథ బాలలు, వీధి బాలలు, సంపాదన సాధ్యం కాని వికలాంగులు ఎందరో దారుణ క్లేశానికి గురవుతున్నారు. వారందరికీ కనీస సౌకర్యాలు కల్పించి సాటి మనుషులుగా జీవించే అవకాశాన్ని కల్పించటం సమాజం బాధ్యత. అదేదో కొందరు వ్యక్తుల దయాదాక్షిణ్యాల మీదనో, దానధర్మాల మీదనో ఆధారపడితే జరిగేది కాదు. వ్యవస్థలో భాగంగా అలాంటి బాధాసర్పదష్టులకు సాంఘిక భద్రత కల్పించటం ప్రభుత్వ బాధ్యతే.

విద్య, ఆరోగ్య, సాంఘిక భద్రతకు ప్రభుత్వాలు ఇస్తున్న ప్రాధాన్యాన్ని గమనిస్తే మన ఆర్థిక వ్యవస్థలో ఎన్ని లోపాలున్నాయో తెలుస్తుంది.

ఆర్థిక వ్యవస్థ నిర్వహణలోనూ, వ్యాపారంలోనూ ప్రభుత్వ జోక్యం అతి తక్కువగా ఉన్న దేశాలలో ఈ మూడు రంగాలకు కలిపి ప్రభుత్వ వ్యయం సగటున జాతీయాదాయంలో 25శాతం ఉంటోంది. గణాంకాలపరంగా చూస్తే ఆయా దేశాలలో కొన్ని మార్పులు కనిపించినా, అక్కడి పన్నులను, ఇతర సంబంధిత వివరాలను పరిగణించి లెక్కిస్తే, దాదాపు అన్ని సంపన్న దేశాలలోనూ, స్వేచ్ఛా వాణిజ్యమున్న దేశాలలోను విద్య, ఆరోగ్యం, సాంఘిక భద్రతలకు ప్రభుత్వం నుంచి జాతీయాదాయంలో సుమారు నాలుగోవంతు ఖర్చవుతోంది. అలాంటిది మనదేశంలో విద్యకు జాతీయాదాయంలో 3.2శాతం, ఆరోగ్యానికి 0.9శాతం, సాంఘిక భద్రతకు ఒక శాతం లోపు ప్రభుత్వం వెచ్చిస్తోంది. అంటే ఈ మూడు రంగాలకు కలిపి కేవలం 5శాతం మాత్రమే, అంటే జాతీయాదాయంలో ఇరవయ్యో వంతు ఖర్చవుతోంది. పోనీ ప్రభుత్వ వ్యయంలో ఈ రంగాల వాటా ఎక్కువగా ఉందేమోనని పరిశీలిస్తే అక్కడ మన వైఫల్యం కొట్టొచ్చినట్లే కనిపిస్తోంది. పైన పేర్కొన్న దేశాలలో ప్రభుత్వ ఖర్చులలో దాదాపు 60శాతం ఈ రంగాలకు ఖర్చవుతుండగా, మనదేశంలో కేవలం 17శాతం మాత్రం సామాన్య ప్రజలకు, అత్యవసరమయిన రంగాలలో వ్యయం చేస్తున్నారు. పోనీ ఆ కొద్ది మాత్రం ఖర్చయినా ప్రజలకు పనికొస్తోందా అని ఆరా తీస్తే చాలా దారుణమైన ఫలితాలు కానవస్తాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎంత డబ్బు ఖర్చు పెట్టినా ఏ మేరకు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారో, ఎంతవరకు బీదలకు కనీస సేవలు అందుతున్నాయో మనకు తెలియంది కాదు. ప్రభుత్వ పాఠశాలల్లో బీదలకు ఏ పాటి పరిజ్ఞానాన్ని ఇవ్వగలుగుతున్నారో మనం చూస్తూనే ఉన్నాం.

**క్షీణిస్తున్న 'సామ్రాజ్యాలు'**

ఈ నేపథ్యంలో కొందరు మంత్రులు, రాజకీయ నాయకులు ప్రభుత్వ పాత్ర పరిశ్రమల రంగంలో తగ్గితే జాతి

ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన పడుతున్నారు. వారి చిత్తశుద్ధిని, దేశభక్తిని మనం శంకించనవసరం లేదు. కానీ మన సమస్య ఇప్పుడు అది కాదు.

అసలు ప్రభుత్వ పాత్ర మనదేశంలో చాలా పరిమితంగా ఉంది. ఆ ఉన్న కొద్ది పాత్ర కూడా ఏ రంగాలలో అవసరమో అక్కడ లేకుండా, ఎక్కడ అనవసరమో ఆ రంగాలలో ఉంది. బీద ప్రజల జీవితాల్లో విద్య, ఆరోగ్యాల మీద శ్రద్ధ లేకుండా గద్దెనెక్కిన వారి పరపతిని, పలుకుబడిని, దర్పాన్ని పెంచే రంగాలకు పరిమితమైంది. ప్రభుత్వ రంగం వాస్తవానికి ప్రజల రంగం కాదు. చాలామేరకు అది అధికారంలో ఉన్న వారికి చెందిన ప్రయివేటు రంగంగా నడుస్తోంది. అందుకే పెట్రోలు బంకుల డీలర్ల నియామకం దగ్గర్నుంచి సామాగ్రి కొనుగోళ్లు, కాంట్రాక్టుల దాకా పైరవీలు, లంచాలు యథేచ్ఛగా సాగుతున్నాయి ఆ కారణం వల్లే ప్రభుత్వ రంగ పెట్టుబడుల విరమణకు వ్యతిరేకత- ప్రధానంగా ఆ సంస్థలపై పెత్తనం చేస్తున్న శాఖల మంత్రుల నుంచి వస్తోంది. ఇందులో ఉంది దేశభక్తి కాదు. తమ 'సామ్రాజ్యాలు' క్షీణిస్తున్నాయనే ఆందోళన.

పెట్టుబడిదారీ విధానాలు, స్వేచ్ఛా వాణిజ్యం మాత్రమే విజయం సాధించాయని, సోషలిస్టు పద్ధతులన్నీ విఫలమయ్యాయని భావించటం కూడా పొరపాటు. నిజానికి పాశ్చాత్య ప్రపంచం విజయం సాధించటానికి, అసాధారణ ప్రగతిని చవి చూడటానికి ప్రధాన కారణం సామ్యవాదంలో ఉన్న కీలకమయిన అంశాలను అంగీకరించి అమలు చేయటం. సోషలిస్టు సమాజాలలో అందరికీ విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, సాంఘిక భద్రత- ఇవన్నీ సమాజమే స్వీకరించాలని, కేవలం వ్యక్తుల చొరవ మీదనే వదిలేస్తే దగాపడ్డ తమ్ముళ్లకు అన్యాయం జరుగుతుందని విశ్వసించారు. ఆ కారణంగానే ఎన్ని లోపాలున్నా సోషలిస్టు దేశాలలో సంపూర్ణ అక్షరాస్యతను, అందరికీ ఆరోగ్యాన్ని అతి త్వరితంగా సాధించారు. ఈ అంశాలను ప్రభుత్వ విధానాలుగా పాశ్చాత్య దేశాలు అంగీకరించాయి. వీటితోపాటు దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్న వారికి సాంఘిక భద్రతను, కనీస ప్రమాణాలతో జీవనావకాశాలను కల్పించటం ప్రభుత్వ బాధ్యతగా అమెరికాతో సహా అన్ని పాశ్చాత్య దేశాలు గుర్తించాయి. అయితే ఆర్థిక వ్యవస్థలో పూర్తి స్వేచ్ఛ, ఆరోగ్యకరమయిన పోటీ అవసరమని, ఉత్పత్తిలో ప్రభుత్వ జోక్యం ఉంటే అనర్థం వాటిల్లుతుందని ఆ దేశాలు పూర్తిగా విశ్వసించాయి. పౌరులను పూర్తిగా విశ్వసించాలని, ప్రజాసార్వభౌమత్వమే పాలనకు పునాది అని స్వేచ్ఛ లేని సమాజంలో ప్రభుత్వానికి నైతిక పునాదులు ఉండవని పాశ్చాత్య దేశాలవారు గుర్తించారు. ఇలా రాజకీయ స్వేచ్ఛ, ఆర్థికరంగంలో పోటీ, సంపద సృష్టికి అవసరమైన కనీస అవకాశాలను ప్రజలందరికీ కల్పించటం- ఈ మూడు పునాదుల మీద పాశ్చాత్య ప్రపంచం నిలబడింది. అంటే- స్వేచ్ఛా వాణిజ్య పద్ధతులను, సోషలిస్టు సమాజాలలోని పద్ధతులను సమన్వయం చేయటం వల్లనే ప్రగతి సాధ్యమయింది.

మనదేశంలో 1991 వరకు సోషలిస్టు విధానాలనే పాటించారు. ప్రతి చిన్న విషయంలోను ప్రభుత్వానికి అపరిమిత అధికారాన్ని కట్టబెట్టి, లైసెన్సు-పర్మిటు-కోటా రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. ఓ అధికారికో, రాజకీయ నాయకుడికో జనజీవనాన్ని శాసించే అవకాశాన్నిచ్చారు. ఆర్థిక అధికారులను చేతుల్లో పెట్టుకుని పోటీని, స్వేచ్ఛను హరించిన ప్రభుత్వం- అందరికీ మంచి ప్రమాణాలతో విద్య, ఆరోగ్యాలను అందించటం, సాంఘిక భద్రత కల్పించటం తన బాధ్యతలుగా గుర్తించలేదు. అంటే.. అటు స్వేచ్ఛా వాణిజ్యంలోను, ఇటు సామ్యవాదంలోను ఉన్న మంచిని విస్మరించి, రెండు వ్యవస్థలలోను ఉన్న చెడును మనం స్వీకరించాం! తత్ఫలితంగానే భారత ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడింది. ప్రపంచం మొత్తంలో అతి ఎక్కువ సంఖ్యలో బీదలు మనదేశంలో మగ్గుతున్నారు.

కాబట్టి మనదేశంలో ప్రభుత్వం పాత్ర తగ్గటం కాదు, పెరగాలి. అయితే ఏ రంగాలలో ప్రభుత్వాలు కీలకపాత్ర పోషించాలి, ఎలాంటి వ్యయం పేదల బతుకులను బాగుచేస్తుంది, ఉపాధి కల్పన ఎలా జరుగుతుంది, ప్రజల అవసరాలు ఎప్పుడు తీరతాయి, వస్తువులు, సేవల నాణ్యత ఏ విధంగా పెరుగుతుంది, కీలక రంగాలలో కేటాయించిన నిధులు సద్వినియోగం చేసి ప్రజలకు తగిన ఫలితాలను ఏ రీతిలో అందించాలి- అన్నవి ప్రధాన చర్చనీయాంశాలు కావాలి. ఈ రంగాల మీద దృష్టిని సారించటం దేశ భవిష్యత్తుకు, బీదల బతుకులు బాగుపడటానికి అత్యవసరం. సిద్ధాంతాల ముసుగులో కొందరు స్వార్థప్రయోజనాలనాశించి కోట్ల మంది బడుగు జీవులను సమిధలుగా చేయటం క్షంతవ్యం కాని నేరం.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా అక్టోబర్ 7, 2002న, జూన్ 16, 2003న ఈనాడులో ప్రచురితమైన వ్యాసాల నుంచి) ◘

# తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ : రాజకీయ సంస్కృతిలో ఉమ్మడిగానే కొనసాగుతున్న రెండు రాష్ట్రాలు

- డా॥ జయప్రకాష్ నారాయణ్

దశాబ్దాల ఆకాంక్షలు, రాజకీయ ఉద్యమాల అనంతరం రెండేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన మొట్టమొదటి ప్రభుత్వాలు తమ పదవీకాలంలో దాదాపు సగం కాలాన్ని సమీపిస్తున్నందున రెండు రాష్ట్రాల్లోని రాజకీయ పరిణామాలను తరచి చూడటానికి తగిన సమయమిది.

రాష్ట్రం ఏర్పాటుకి దారితీసిన విద్వేష, శత్రుత్వ భావాలు, ప్రజల మధ్య విభజన తెచ్చే ధోరణులు పూర్తిగా సమసిపోవటం ఈ రెండేళ్లలో కనిపించే సంతోషకర పరిణామం. రాజకీయ డ్రామాలు, పనిగట్టుకుని తయారుచేసిన భావోద్వేగాలతో సంబంధం లేకుండా తమ జీవితాలు యధావిధిగానే కొనసాగుతుంటాయని రెండు రాష్ట్రాల ప్రజలూ గుర్తించారు. రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజల మధ్య సుహృద్భావాన్ని, సామరస్యాన్ని పునరుద్ధరించటంలో నాయకులు కూడా ప్రశంసనీయ పాత్రను నిర్వహించారు. ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు.. సంకుచిత భావోద్వేగాల్ని చల్లార్చి రెండు రాష్ట్రాల ప్రజల మధ్య సయోధ్యను తిరిగి నెలకొల్పటంలో కీలక పాత్ర పోషించారు.

ఇక రెండు రాష్ట్రాల్లో గత రెండేళ్లలో ప్రస్ఫుటంగా కనిపించే విచారకర అంశం– అంతకంతకూ మూర్ఖపు, ఏకపక్ష, ఫ్యూడల్ రాజకీయ సంస్కృతి పెరగటం, రాష్ట్రాల్ని సొంత సామ్రాజ్యాల్లా భావిస్తూ పాలకులు నియంతృత్వ అధికారాన్ని చెలాయించటం! తెలుగు రాష్ట్రాల్లో ఓట్ల కొనుగోలు, డబ్బు సంస్కృతి గురించి రెండు దశాబ్దాలుగా అందరికీ తెలిసిందే. కానీ శాసనసభా రాజకీయాలలో నైతిక దివాళాకోరుతనానికి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే ధోరణికి అద్దం పట్టే ఉమ్మడి లక్షణం ఒకటి రెండు రాష్ట్రాలయ్యాక తయారైంది. ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల్లోని చాలామందిని హోల్‌సేల్‌గా ఇరు రాష్ట్రాల్లోని అధికార పార్టీలు లాగేసుకున్నాయి. వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాల కోసం దోపిడీలో భాగస్వాములవటానికి ప్రభుత్వ అండదండలు కావాల్సిరావటం ఈ ఫిరాయింపులకు ఒక ప్రధాన కారణం.



అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి చేస్తున్న రూ.5–10 కోట్లు ఖర్చుతో ఎన్నికల వ్యయం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రమాదకర స్థాయికి చేరటం, గెలిచాక ప్రజలకు అందుబాటులో ఉండటం పేరుతో ప్రభుత్వోద్యోగులు చేయాల్సిన పనులను చేసేందుకు అనుచరగణాన్ని మెయింటెయిన్ చేయాల్సి ఉండటంతో చాలామంది శాసనసభ్యులు ప్రతిపక్షంలో దిక్కుతోచనివారుగా, నిస్సహాయులుగా మారిపోయారు. సభలో చర్చించి చట్టాలు చేయటం కాకుండా ప్రభుత్వ కార్యనిర్వహణ పాత్రలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాత్ర పోషించటం శాసనసభకు ఎన్నికవటం వెనక లక్ష్యంగా తయారైంది. ఇలా కార్యనిర్వహణ వ్యవస్థలో భాగంగా కనిపిస్తుంటేనే, కాంట్రాక్టులు, ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగులు, భూముల కేటాయింపులు, ప్రకృతి వనరులు కేటాయింపులు, పోలీసు కేసులు లేదా ప్రయివేటు తగాదాల్లో జోక్యం వంటి వాటి ద్వారా భారీ అవినీతికి అవకాశం చిక్కుతుంది.

దీంతో, ఎన్నికల్లో ఖర్చు చేసిన కోట్ల రూపాయలకు అనేక రెట్లు వసూలు చేసుకోవాలంటే అధికార పార్టీలోనే ఉండాలన్న భావన ప్రబలిపోయింది. ఎన్నికైన ప్రభుత్వాలకు చట్టబద్ధ పాలన, నైతికత, న్యాయం పట్ల ఏమాత్రం గౌరవం లేకపోవటం ఫిరాయింపులు పెచ్చరిల్లిపోవటానికి ఇంకో కారణం. ప్రతిపక్ష శాసనసభ్యునికి ఓటు వేశారని అనుమానిస్తున్న ప్రజానీకానికి, ప్రతిపక్ష పార్టీలను ఎన్నుకున్న నియోజకవర్గాలకు

మిగిలినవారితో సమానంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందకుండా రకరకాల ఎత్తులుజిత్తులతో అవరోధాలను సృష్టిస్తున్నారు. మిగతావారితో పోలిస్తే ప్రజాసేవ భావనతో ఉన్నవారు, అధికారంలో భాగస్వాములై అవినీతి సొమ్మును దండుకుందామని ఆశించకుండా ఉన్నవారు కూడా తమ నియోజకవర్గాల కోసం ఫిరాయించాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు. ఫలితంగా, రెండు రాష్ట్రాల్లో పేరుకు తప్ప ప్రతిపక్షమన్నదే లేకుండా గంపగుత్త ఫిరాయింపులు జరిగాయి.




ఇక రెండు రాష్ట్రాల గురించీ చెప్పుకోవాల్సిన మూడో అంశం– వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నా 2014 ఎన్నికలకు ముందుకాలం నాటి తాయిలాల్ని, విధానాల్నే కొనసాగించటం. ఒకపక్క, తాత్కాలిక రాజకీయ అవసరాల కోసం రేపు ప్రజల భవిష్యత్తు ఏమవుతుందోనన్న ఆలోచన కూడా లేకుండా అత్యంత బాధ్యతారహితంగా ఇచ్చిన ఉచితాలకు రెండు రాష్ట్రాలూ మూల్యం చెల్లిస్తున్నాయి. దీన్ని సరిదిద్దుకుని ప్రజలు సమానావకాశాలతో ఎదిగేందుకు కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించేందుకు ఎటువంటి ప్రయత్నమూ లేదు. మరోపక్క, ప్రయివేటు పెట్టుబడులను పెంచుకోవటానికి రెండు రాష్ట్రాలూ పోటాపోటీగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. తాత్కాలిక పథకాలు, వాస్తవిక ఆర్థిక ప్రయత్నాలు కలగలిసిన నమూనా వర్తమాన భారతదేశంలో చాలా రాష్ట్రాలలో కనిపించే రాజకీయ దృశ్యమే. అయితే నిజమైన సంస్కరణలకు కావలసిన డీరెగ్యులరైజేషన్, ఏకపక్షంగా, వ్యక్తిగత విచక్షణతో నిర్ణయాలకు స్వస్తి చెప్పటం, ప్రకృతి వనరుల కేటాయింపులో పారదర్శక బహిరంగ పోటీ విధానం, ప్రభుత్వోద్యోగులలో జవాబుదారీ తనం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా ప్రజలకు తేలిగ్గా నాణ్యమైన సేవలు అందించటం, అధికారాలను, నిధులను పేరుకి కాకుండా నిజంగా స్థానికంగా జనం చేతుల్లోకి బదలాయించటం, సాధికారత వంటివి కనిపించవు. అక్కడక్కడా ప్రయత్నాలు కనిపించినా అవి అరకొరే.

చివరిగా, ప్రత్యేక హోదా విషయంలో ఇచ్చిన హామీపై కేంద్రం వ్యవహారశైలి పట్ల ఆంధ్రప్రదేశ్ ఆవేదన, ఆగ్రహం గురించి తప్పనిసరిగా కొంత చెప్పుకోవాలి. "ప్రత్యేక హోదా" అనేది మూడు ప్రయోజనాలనిచ్చే కోడ్ మాత్రమే: రాష్ట్ర విభజన వల్ల తలెత్తిన రెవిన్యూ లోటును భర్తీ చేయటం, మౌలిక వసతులు, సంస్థలు, కొత్త రాజధాని నిర్మాణానికి సాయం, కొత్త పెట్టుబడులకు కొంతకాలం పాటు పన్ను రాయితీలు.

రెవిన్యూ లోటు భర్తీకి 14వ ఆర్థిక సంఘం నిధుల్ని కేటాయించటం, చాలా సంస్థలకు సాయం అందించటం, రాజధాని, పోలవరం నిర్మాణం.. వీటిలో మొదటి రెండు హామీల్ని నెరవేర్చారు. పన్ను రాయితీల హామీ ఇంకా మాటలకే పరిమితమై ఉంది. సంక్లిష్టమైన ఫెడరల్ వ్యవస్థ ఉన్న మనదేశంలో ఇలాంటి సున్నితమైన భావోద్వేగపూరితమైన విషయానికి సంబంధించి కేంద్రప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞతతో, సంయమనంతో వ్యవహరించాలి. వెనకబడిన రాయలసీమ, ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాలకు పెట్టుబడుల్ని తెచ్చే పన్ను రాయితీల్ని అందించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయవచ్చు. మిగతా రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు రాకుండా ఉండేందుకు, దేశవ్యాప్తంగా 100 వెనకబడిన జిల్లాలను గుర్తించి నిర్దిష్ట కాలవ్యవధి వరకూ అలాంటి పన్ను రాయితీల్ని వాటికీ అందించవచ్చు.

దగాపడ్డామన్న భావన రాజకీయ జ్వాలగా మారి ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో పరాయీకరణ భావనకు, అశాంతికి దారితీయకముందే ప్రత్యేక హోదా అంశాన్ని సున్నితంగా, న్యాయబద్ధంగా పరిష్కరించాల్సుంది. ▪

# రెండు రాష్ట్రాలు, రెండేళ్లు

-కె.శ్రీనివాస్,
సీనియర్ సంపాదకులు

రాష్ట్ర విభజన జరిగి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, రెండు రాష్ట్రాల్లోనూ భిన్నమయిన స్పందనలు వ్యక్తం కావడం సహజమే. ప్రత్యేక రాష్ట్రం కోరుకుని, అందుకోసం సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న వారు ఈ సందర్భాన్ని ఘనంగా సంబరంగా ఉద్వేగపూరితంగా జరుపుకుంటారు. రాష్ట్ర విభజన కూడదని, కలిసి ఉండడం తప్ప మరో ప్రత్యామ్నాయానికి ఒప్పుకోబోమని చివరిదాకా పట్టుపట్టినవారికి ఈ రోజు అన్యాయానికీ, అవమానానికీ, పరాజయానికీ జ్ఞాపిక. విజయోత్సాహంతో పరవళ్లు తొక్కుతున్న వారికి కొన్ని లక్ష్యాలు, గమ్యాలు ఉన్నాయి. వాటి సమీక్షకు జూన్ 2 ఒక అవకాశం. జరిగినదానికి దు:ఖిస్తున్నవారికి, తమకు జరిగిన నష్టాన్ని అధిగమించడానికి కొత్తగా ఏర్పరుచుకున్న కొన్ని లక్ష్యాలు, గమ్యాలు ఉన్నాయి. వాటికి పునరంకితం కావడానికి జూన్ 2 ఒక వేదిక.

రోజుల కిందట నరేంద్రమోదీ ప్రభుత్వం కూడా రెండేళ్లు పూర్తి చేసుకున్నది. కొన్ని విశేషాలు ఉన్నప్పటికీ, ఆ సందర్భం ఒక ఆనవాయితీ మాత్రమే. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. మారుతుంటాయి. విధానాలలో పెద్దగా మార్పేమీ ఉండదు. కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు వార్షికోత్సవాలు జరుపుకుంటాయి. తమకేమో సొంత విధానాలున్నట్టు విజయాలను సమీక్షించుకుంటాయి. పదేళ్లపాటు యూపీయే ప్రభుత్వాన్ని భరించిన ఓటర్లు, మార్పు కోసం 2014లో ప్రతిపక్షపార్టీకి అధికారం అప్పగించారు. దాని పురోగతి ఎట్లా ఉన్నది, నరేంద్రమోదీ రెండేళ్లలో ఏమి సాధించారు– మీడియాలో బాగానే చర్చ జరిగింది. యూపీఏకు కొంచెం అసహనం కలిపితే, ఎన్‌డీఏ.

తెలుగు రాష్ట్రాల పరిస్థితి వేరు. 2014లో ఇక్కడ జరిగింది కేవలం ఎన్నికల ప్రక్రియ కాదు. ఒక రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయింది. విడిపోవాలనుకున్నవారు కొత్త రాష్ట్రం మీద ఎంతో ఆశపెట్టుకున్నారు. వద్దనుకున్నవారు, భవిష్యత్తు ఎట్లా ఉంటుందోనన్న కలవరానికి లోనయినారు. తెలంగాణ ప్రజలు తమ కొత్త రాష్ట్రానికి, ప్రత్యేక ఉద్యమానికి ప్రధాన రాజకీయ నాయకత్వాన్ని ఇచ్చిన పార్టీకే పట్టం కట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు, అవశేష రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి కుదుటపరచగలదనుకున్న పార్టీకి అధికారం అప్పగించారు. కాబట్టి, తెలంగాణలో రాష్ట్రానికీ, ప్రభుత్వానికీ కూడా రెండేళ్లు. తేదీలు తేడా ఉండవచ్చును కానీ నవ్యాంధ్రలో కూడా రాష్ట్రానికీ, ప్రభుత్వానికీ కూడా రెండేళ్లు.

తెలంగాణలో కనిపిస్తున్న ఉత్సాహాన్నీ, ఆర్భాటాన్నీ చూస్తుంటే, రాష్ట్రావతరణ వార్షికోత్సవానికీ, ప్రభుత్వ వార్షికోత్సవానికీ తేడా చెరిగిపోయినట్టు కనిపిస్తోంది. జూన్ రెండో తేదీనాడే నూతన ప్రభుత్వం ప్రమాణం చేసినందున, టీఆర్ఎస్ ప్రభుత్వం తన ద్వితీయ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం, ఘనతలను చెప్పుకోవడం సమంజసమే. ప్రభుత్వం చేసిందేమీలేదు అంతా వాగాడంబరం అంటూ– కొనప్రాణంతో మిగిలివున్న ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోయడం కూడా సహజమే. కానీ జూన్ రెండు తెలంగాణ అవతరణ దినోత్సవమన్న సంగతి పెద్ద ముఖ్యం కాదన్నట్టు వ్యవహరించడంకానీ, ప్రత్యేక రాష్ట్ర ప్రస్థానం ఎంత దాకా సాగిందో ఒకసారి మననం చేసుకోవాలనుకోకపోవడం కానీ జరిగితే, అవి సహజమైన విషయాలు కావు.



> ప్రభుత్వాలదీ, రాజకీయపక్షాలదీ ఏముంది, వారు జరిపే వేడుకలూ, దీక్షలూ పాలనా వ్యూహంలోనే, రాజకీయ చాతుర్యంలోనే భాగాలవుతాయి. ప్రజలే, తామెక్కడ తప్పిపోయామో, పోతున్నామో గ్రహింపుతో ఉండాలి. తమ విచక్షణను, వివేకాన్ని గుడ్డిగా నేతలకు అర్పించకుండా, ఆదమరపు లేకుండా ఉంటే, బండి గాడి తప్పినపుడు మళ్లీ దారిలోకి తేగలుగుతారు.

తెలంగాణలో మలిదశ ప్రత్యేక ఉద్యమం ఏ చారిత్రక సందర్భంలో వచ్చిందో, అది ఆరంభంలో ఏయే విలువలను ఆధారం చేసుకున్నదో, ఎదిగే క్రమంలో ఏ ఆదర్శాలను కలగన్నదో– తెలంగాణ ఉద్యమ సమాజం ఒకసారి వెనక్కి తిరిగి చూసుకోవాలి. రాష్ట్ర విభజనను గట్టిగా వ్యతిరేకించినవారు కూడా ప్రశంసించిన లక్షణాలు కొన్ని తెలంగాణ ఉద్యమానికి ఉన్నాయి. వాటిలో ముఖ్యమయినవి, సకల జనుల సమష్టి ఆచరణ, సృజనాత్మకత, మేధారంగాల దోహదం. తెలంగాణ ఉద్యమం కేవలం ప్రత్యేక రాష్ట్రాన్ని మాత్రమే కోరలేదు. బలవన్మరణాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు లేని పాలనను ఆ రాష్ట్ర స్వభావంలో అంతర్భాగంగా చూశారు. అభివృద్ధి రచనను

ప్రజానుకూలంగా తీర్చిదిద్దాలని, అందులో ప్రజాప్రయోజనాలకు తప్ప మరి దేనికీ ప్రాధాన్యం ఉండకూడదని భావించారు. ఉద్యమకాలంలో ఉన్న భాగస్వామ్యం విధానరచనలోనూ, పునర్నిర్మాణంలోనూ ఉండాలని ఆశించారు. విధ్వంసక గుణంలేని అభివృద్ధిని, ప్రమాదంలేని పర్యావరణాన్ని, స్థానికమైన ప్రాకృతిక, మానవ వనరుల మీద ఆధారపడే పారిశ్రామిక విధానాన్ని, సంరక్షణ పొందే వారసత్వాన్ని, గర్వపడే చారిత్రక సంపదను–సొంత రాష్ట్రంలో చూసుకోవాలని తెలంగాణ ఉద్యమం ఆశపడింది. ఈ ఆశలు ఎంతవరకు నెరవేరుతున్నాయో, తరచి చూసుకోవలసిన సందర్భం కూడా ఇదే. తీవ్రమయిన దుర్భిక్షం, రాజ్యహింస, గ్రామీణ సంక్షోభాల నడుమ– వాటన్నిటికి నిష్కృతిగానో లేదా కనీసం ఉపశమనంగానో–తెలంగాణ ఉద్యమం తలెత్తింది. కరువు అట్లానే ఉన్నదా, నిర్బంధం పరిస్థితి ఏమిటి, పల్లెల్లో మనుగడలను సానుకూలం చేసే ప్రయత్నాలు సాగుతున్నాయా?– వీటిని గురించి కూడా చర్చించాలి.

ఉద్యమసంస్థగా ఉన్న పార్టీ, అధికారంలోకి వచ్చిన తరువాత తానిక పూర్తిస్థాయి రాజకీయ పార్టీగానే వ్యవహరించబోతున్నదని స్పష్టం చేసిందంటే, ఉనికిలో ఉన్న సాధారణ మధ్యేవాద రాజకీయ పక్షం అనుసరించే వ్యూహాలను మాత్రమే పాటిస్తుంది తప్ప, అంతకంటే ఉన్నతమైన నైతికతను కాదని అర్థం చేసుకోవాలి. ఫిరాయింపుల గురించి, అసాధారణ పద్ధతులలో బలాన్ని పెంచుకునే ప్రయత్నాల గురించి విమర్శించి ఉపయోగం లేదు. అట్లా విమర్శించే పక్షాలకు కూడా ఆ అంశాలలో అంతకుమించిన నైతికత ఏమీ ఉండదు. రాజకీయంగా తన మనుగడను సుస్థిరం, బలోపేతం చేసుకోవడానికి పాలనాపరంగా కూడా ఆ పార్టీ, ఆదర్శాలకు దూరంగా ఉండే అనేక పద్ధతులను అనుసరిస్తుందన్న స్పృహ ఉండాలి. ఉద్యమకాలంలో మొత్తం సమాజం వ్యక్తం చేసే లక్ష్యాలను ఆ సమయంలో సమర్థించినా, అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యమపార్టీ తన మనుగడకు అనుగుణమైన వాటిని మాత్రమే స్వీకరిస్తుంది. వ్యవస్థలో మౌలికమయిన మార్పులను కానీ, అమలులో ఉన్న ఆర్థిక విధానాలను తలకిందులు చేయడంకానీ ఆ పార్టీ చేయబోదు. అటువంటి రాడికల్ లక్ష్యాలు ఆ పార్టీకి ఉండవు. ఒక ఉద్యమం మీద ఆధారపడి అధికారంలోకి వచ్చిన సాధారణ మధ్యేవాద పార్టీ, ఉద్యమ ఆశయాలను పాక్షికంగా స్వీకరించవచ్చు. తన ప్రయోజనాలకు అనుగుణంగా ఉన్నమేరకు అభివృద్ధి కార్యక్రమాలను కూడా చేపట్టవచ్చు. అంతవరకు మాత్రమే చూడగలిగితే, తెలంగాణ రాష్ట్రంలో అధికారపక్షం ఉత్తీర్ణత పొందినట్టే చెప్పవచ్చు. తెలంగాణ దుస్థితికి కారణమని ఉద్యమకాలంలో భావించిన సాగునీటి కొరత, విద్యుత్ సంక్షోభం–వంటి అంశాలలో అధికారపక్షం సమర్థంగా దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నదనే భావించాలి. వాటి పూర్తిస్థాయి సాఫల్యం, ప్రజలకు కలిగే లబ్ధి ముమ్ముందు అంచనా వేయగలం. ఉద్యమ లక్ష్యాలుగా ప్రసిద్ధమయినవాటిలో తనకానాడూ ఈనాడూ స్వభావరీత్యా విశ్వాసం, నిబద్ధత లేని అంశాల విషయంలో మాత్రం పాత ప్రభుత్వాల కోవలోనే కొత్త ప్రభుత్వమూ పనిచేస్తున్నది.

ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను పరిగణలోకి తీసుకున్నట్లు కనిపిస్తూ, రాజకీయ పాలనాపరమైన విన్యాసాలు చేస్తున్నది. ఉద్యమం సృష్టించిన శిలాసదృశమైన ఐక్యతను కరిగించివేయడం కూడా ప్రభుత్వ అవసరాలలో ఒకటి. నీ చొరవను, నీ జ్ఞానాన్ని, నీ ఉద్వేగాలను నాకు అర్పించు, నీ యోగక్షేమాలు నేను చూసుకుంటాను అంటాడు రాజకీయ నాయకుడు. అందులోని కిటుకును గ్రహించాలి. దాని గురించిన ఎరుక ఉండి కూడా, తెలంగాణ ఉద్యమ సమాజం, తాను నెత్తురోడి సాధించుకున్న ఐక్యతను, రాజకీయ పక్షాలను నియంత్రించే, ఒత్తిడిపెట్టే బ్రహ్మాస్త్రం వంటి ఐక్యతను, స్వచ్ఛందంగా పలచబరుచుకుంటున్నది.

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఈ విషయంలో అన్యాయం జరిగింది. సమైక్య ఉద్యమానికి తెలంగాణ ఉద్యమం వలె ఒక స్వతంత్రమైన ఉనికి, కార్యక్రమమూ లేవు. రాష్ట్ర విభజన జరిగితే ఏమి చేయాలి అన్న ఊహను కూడా రానివ్వకుండా, సమైక్య ఉద్యమ వ్యూహకర్తలు జాగ్రత్తపడ్డారు. కలిసి ఉండడం తప్ప మరే లక్ష్యమూ లేని ఉద్యమం, విభజన తరువాత అర్థరహితమై పోయింది. పైగా, సకలజనుల ఉద్యమం రీతిలో ఆంధ్ర ప్రాంతంలోని ప్రజా ఆందోళనలు ఒక బలమైన ఐక్యతను సాధించలేకపోయాయి. అందువల్ల, జూన్ రెండు అంటే, తమకు అన్యాయం జరిగిన రోజుగా భావించడం తప్ప గత్యంతరం మిగలలేదు. బాధితులుగా మిగిలామని, ఇందులో నుంచి తిరిగి అభివృద్ధి దారిలోకి తీసుకువస్తామని చెప్పే నాయకుల వెనక నడవడం తప్ప మరో దారి లేదు. ప్రాణావసరమో కాదో, కాక మరో లక్ష్యాన్ని ఎంచుకోవచ్చునో తెలియకుండా ప్రత్యేకహోదా వంటి నినాదాలలో ఉపశమనం పొందడం తప్ప ఇంకో కార్యాచరణ లేదు. రాయలసీమలోను, ఉత్తరాంధ్రలోను తమకు కొత్తగా జరగబోయే అన్యాయాల గురించి ఇప్పుడిప్పుడే గొంతు విప్పుతున్న వారికి కూడా తగినంత నైతిక బలం ఎందుకు లేదంటే, విభజన సమయంలో వారు కూడా అర్థరహితమైన సమైక్య జపంలో కొట్టుకుపోయారు.

ప్రభుత్వాలదీ, రాజకీయ పక్షాలదీ ఏముంది, వారు జరిపే వేడుకలు, దీక్షలు కూడా పాలనా వ్యూహంలోనో, రాజకీయ చాతుర్యంలోనో భాగాలవుతాయి. ప్రజలే, తామెక్కడ తప్పిపోయామో, పోతున్నామో గ్రహింపుతో ఉండాలి. తమ విచక్షణను, వివేకాన్ని గుడ్డిగా నేతలకు అర్పించకుండా, ఆదమరపు లేకుండా ఉంటే, బండి గాడి తప్పినప్పుడు మళ్లీ దారిలోకి తేగలుగుతారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ◘

# అప్పుల్లో తెలుగు ప్రజలు

మానవ వనరుల అభివృద్ధి విషయంలో వెనకబడిఉన్న తెలుగు రాష్ట్రాలు అప్పులలో దేశంలోనే ముందువరసలో ఉన్నాయి. పల్లెల్లో రైతు పరిస్థితికి పట్టణాల్లో సొంత వ్యాపారాలు చేసుకునేవారి పరిస్థితికి పెద్ద తేడా ఏమీ లేదు. దేశంలో అన్ని రంగాలను కలిపి చూసినా, వ్యవసాయ రంగంలోనైనా తెలుగు కుటుంబాలకే అప్పులు అత్యధికంగా ఉన్నట్టు 70వ జాతీయ నమూనా సర్వేలో తేలింది. మొత్తం 18 రాష్ట్రాల్లోను, కేంద్రపాలిత ప్రాంతాల్లోను ఆస్తులు, అప్పుల గురించి కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ సర్వే చేపట్టింది. 2012-13 శాంపిల్ల ఆధారంగా ఈ సర్వే జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌లోని 54.1శాతం మందికి అప్పులు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతంలో రుణాల పరిస్థితిని చూస్తే, రైతుల్లో 62.8శాతం మందికి, వ్యవసాయేతరుల్లో 47.1శాతం మందికి అప్పులు ఉన్నాయి. పట్టణాల్లో సొంతంగా వ్యాపారం చేసుకునేవారిలో 51.3శాతం మంది, ఇతరుల్లో 25.9శాతం రుణాల్లో ఉన్నారు. జాతీయస్థాయి అప్పుల చిట్టాలో గ్రామీణుల రుణాల విషయంలో దేశవ్యాప్తంగా తెలంగాణ తరువాత ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ కుటుంబాలు అప్పుల ఊబిలో ఉన్నాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 1000 కుటుంబాలకు సగటున 694 రైతు కుటుంబాలు నగదు అప్పుగా తీసుకున్నాయి. ఒక్కో కుటుంబానికి రూ.68,485 అప్పు ఉంది. మరే రంగానికి సంబంధించిన కుటుంబాలకూ ఇంత అప్పు లేదు. పెద్ద రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి చోట్ల కూడా రైతు కుటుంబాలకు సగటు నగదు అప్పు తెలంగాణలో ఉన్నదాంట్లో సగం కూడా లేదు. దేశంలోనే సగటు అప్పు ఎక్కువగా ఉన్న కుటుంబాల శాతంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను కలిపిచూసినా, తెలంగాణలో 59.1శాతం కుటుంబాలకు అప్పులున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 69.4శాతంగా ఉంది.

పట్టణ ప్రాంతాల అప్పుల విషయంలో సగటున కేరళ 47శాతంతో మొదటిస్థానంలో ఉండగా, 39.8శాతంతో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. సగటు ఆస్తుల లెక్క తీస్తే ఏపీ 16వ స్థానంలోను, తెలంగాణ 12వ స్థానంలోను ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో గృహస్థ సగటు ఆస్తి విలువ రూ.4.12 లక్షలుగా ఉంటే, పట్టణాల్లో ఆ విలువ రూ.9.91 లక్షలుగా ఉంది. తెలంగాణ గ్రామీణుల్లో రూ.6.4లక్షలు, పట్టణాల్లో రూ.18.4లక్షలు ఆస్తి ఉంది. తెలుగువారికి భూమి, బంగారం మీద పెట్టుబడి పెట్టటంపై ఆసక్తి ఎక్కువగా ఉంది.

జాతీయస్థాయిలో సగటు ఆస్తిపరుల్ని తీసుకుంటే, పల్లెల్లో తొలి 10శాతం మందికి రూ.57లక్షలుండగా, చివరి 10శాతం మందికి రూ.25,071 ఉన్నాయి. పట్టణాల్లో ఈ మొత్తాలు రూ.1.46 కోట్లు, రూ.291గా ఉన్నాయి. అలాగే పల్లెటూళ్లలో భూములున్నవారిలో 1శాతం మందికి మాత్రమే పట్టణ ప్రాంతాల్లోనూ కొంతమేర భూ రూపంలో ఆస్తి ఉంది. పట్టణ ప్రాంతాల్లో భూములున్న అక్కడి గృహస్థుల్లో 15శాతం మందికి పల్లెల్లోనూ భూములున్నాయి. పట్టణ ప్రాంతాల్లో దేశంలోకెల్లా ఆస్తికి అత్యధిక విలువ ఛండీగఢ్‌లో ఉంది. గ్రామీణ ఆస్తి విలువ అత్యధికంగా ఢిల్లీలో ఉంది.

**దక్షిణాదిలో బంగారం ధగధగ**

దేశవ్యాప్తంగా కుటుంబాలకున్న బంగారు ఆభరణాలను పరిశీలిస్తే దక్షిణాది రాష్ట్రాలు ధగధగ మెరుస్తున్నాయి.

- జాతీయస్థాయి గ్రామీణంలో సగటును 82.2శాతం, పట్టణాల్లో 81.1శాతం కుటుంబాలకు నగలుంటే, దీనికన్నా చాలా ఎక్కువగా దక్షిణ భారత రాష్ట్రాల్లో ఉన్నాయి
- గ్రామీణంలో కర్ణాటకలో 94శాతం, తమిళనాడు 91.6, తెలంగాణలో 90శాతం కుటుంబాలకు బంగారు నగలున్నట్టు తేలింది. ఈ విషయంలో ఏపీలో జాతీయ సగటుకన్నా తక్కువగా 82శాతం కుటుంబాలకు నగలున్నాయి
- పట్టణ ప్రాంతాల్లో కేరళ కుటుంబాల్లో 91.3, తమిళనాడు 89.4, కర్ణాటక 87.8, తెలంగాణ 87.7శాతం కుటుంబాలకు నగలున్నాయి
- బంగారు నగలున్న కుటుంబాల్లో తెలంగాణ రాష్ట్రం గ్రామీణ

ప్రాంతాల్లో దేశంలో 3వ స్థానంలో, పట్టణాల్లో 4వ స్థానంలో ఉండటం విశేషం

- ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో 82శాతం, పట్టణ ప్రాంతాల్లో 81.1శాతం మందికి బంగారు నగలున్నాయి
- బ్యాంకు ఖాతాలు తెరిచిన గ్రామీణ కుటుంబాలు ఏపీలో 75.1శాతం ఉన్నాయి. 22.8శాతం మందికి తపాలా ఖాతాలున్నాయి. పట్టణాల్లో 81.8 శాతం మందికి బ్యాంకు ఖాతాలుంటే, తపాలా ఖాతాలు 13.4శాతానికి ఉన్నాయి
- తెలంగాణలో గ్రామీణంలో 73.7, పట్టణాల్లో 82.3 శాతం కుటుంబాలకు బ్యాంకు ఖాతాలున్నాయి
- కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రతి వెయ్యి కుటుంబాలలో తెలంగాణలో కేవలం 2 కుటుంబాలకే ఉన్నాయి. తపాలా ఖాతాలు 40 కుటుంబాలకున్నాయి.

## లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా మళ్లీ దోసపాటి రాము



లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా దోసపాటి రాము మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగారావు ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ ప్రతిష్ట పెంచటానికి, ప్రజాసమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పనిచేస్తున్నందున తిరిగి రామును పదవికి ఎంపికచేశామన్నారు.. రాము నియమకాన్ని జాతీయ అధ్యక్షుడు సురేంద్ర శ్రీవాస్తవ, వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌కి కూడా తెలిపినట్టు చెప్పారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, గతంలో పార్టీ అభివృద్ధి కోసం, నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేశానని తెలిపారు. మహిళల భద్రత, సీసీ కెమేరాల ఏర్పాటు, ట్రాఫిక్ సమస్యలు, జబ్బర్ ట్రావెల్స్ బస్సు దుర్ఘటనపై బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం, నగర పాలనపై ప్రజల్లో చైతన్యం వంటి అంశాలపై చేసిన కృషిని వివరించారు. మరోసారి నగర పార్టీ అధ్యక్షునిగా నియమించినందున మరింత బాధ్యత పెరిగిందని రాము అన్నారు.


## ఉత్తమ సామాజిక కార్యకర్తగా భీశెట్టికి సత్కారం

లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీని ఉత్తమ సామాజిక కార్యకర్త పురస్కారంతో విజయనగరం జిల్లా సత్కరించింది. జిల్లా ఆవిష్కరణ దినోత్సవమైన జూన్ 1న కలెక్టర్ ఈ పురస్కారాన్ని అందించారు. వ్యక్తి సుఖాన్ని, సమాజ హితాన్ని అనుసంధానం చేస్తూ మంచి రాజకీయాన్ని అందించే లోక్‌సత్తా వేదికగా చేస్తున్న కృషే తనకీ గౌరవాన్ని అందించిందని బాబ్జీ ఈ సందర్భంగా అన్నారు.



# వ్యవసాయంలో ఉపాధి.. వృద్ధి మాత్రం వ్యవసాయేతర రంగాల్లో
## -తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే-

**జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్)లో అనుబంధ రంగాల వారీగా వాటా**




రెండేళ్లుగా దుర్భిక్ష వాతావరణం నెలకొన్నా తెలంగాణ రాష్ట్రం 2015-16లో 9.4శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. జాతీయ సగటు 7.6శాతం మాత్రమే. అన్ని రకాల పంట దిగుబడులూ గత ఏడాదికన్నా ఐదో వంతు తగ్గిపోయి, వ్యవసాయ, అనుబంధ రంగాలన్నీ మైనస్ ప్రగతిని (-4.5శాతం) నమోదు చేయగా, పరిశ్రమలు, సేవారంగం, విద్యుత్తు, వ్యాపారం, రియల్ ఎస్టేట్ వేగంగా వృద్ధిని నమోదు చేస్తుండటం వల్ల జాతీయ సగటును తెలంగాణ అధిగమించగలిగింది. వృద్ధి రేటును ప్రస్తుత ధరల ప్రకారం చూసినా, తెలంగాణ 11.7శాతంతో ముందంజలో నిలిచింది. రూ.5.83లక్షల కోట్ల జీడీపీని నమోదు చేయనుంది.


ఈ వివరాలను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించింది.

తలసరి ఆదాయంలో తెలంగాణ రూ.1.29 లక్షలతో పరుగుతీస్తోంది. హైదరాబాద్ మహానగరంలో భాగంగా ఉన్న మూడు జిల్లాలు, కోస్తాను ఆనుకుని ఉన్న రెండు జిల్లాలు కలిపి మొత్తం లక్షకు పైగా తలసరి ఆదాయాన్ని నమోదు చేశాయి. అందులో హైదరాబాద్ అత్యధికంగా రూ.2.94లక్షల తలసరి ఆదాయాన్ని నమోదు చేసింది. మిగతా ఐదు జిల్లాలకు లక్షకన్నా తక్కువ తలసరి ఆదాయాన్ని నమోద చేశాయి.

తెలంగాణలో ఉపాధి తీరుతెన్నులు మారుతున్నాయని సర్వే వెల్లడించింది. వ్యవసాయం, పశుపోషణ, గనుల వంటి ప్రాథమిక రంగాల్లో ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఈ రంగాల నుంచి మానవ వనరులు క్రమంగా పరిశ్రమలు, వినోదం, సేవల రంగాలకు మళ్లుతున్నాయి. అయితే జీడీపీ పెరిగినంత వేగంగా ఈ రంగాల్లో ఉద్యోగాలు పెరగటం లేదు. జీడీపీలో తక్కువ వాటా ఉన్నా వ్యవసాయమే ఇంకా ఎక్కువమందికి ఉపాధిని కల్పిస్తోంది. తెలంగాణ జీడీపీలో వ్యవసాయం వాటా 12.9 శాతం మాత్రమే అయినా 55శాతం మంది ఇంకా ఈ రంగం మీదే ఆధారపడి ఉన్నారు. సేవారంగం వాటా జీడీపీలో 60శాతానికి పెరిగినా ఆ రంగం కేవలం 26శాతానికే ఉపాధినిస్తోంది. అయితే వ్యవసాయేతర రంగాలలో వృద్ధి వల్లే తెలంగాణ జాతీయ సగటును అధిగమించగలుగుతోంది.

### పట్టణ యువతలో నిరుద్యోగం

తెలంగాణలో నిరుద్యోగిత సగటున 2.7శాతంగా ఉంది. గ్రామాల్లో 1.1శాతంగా ఉంటే పట్టణాలలో గరిష్టంగా 6.6శాతంగా ఉంది. పట్టణాలలో ముప్పయ్యేళ్ల వయసులోపు





ఉన్నవారిలో నిరుద్యోగిత అధికంగా 17.2శాతంగా ఉంది. పట్టణ జనాభాలో 40శాతం మంది నెలవారీ జీతాలతో ఆదాయం పొందుతుండగా దాదాపు అంతేసంఖ్యలో స్వయంఉపాధి మీద బతుకుతున్నారు. గ్రామాల్లో స్వయంఉపాధి, దినసరి కూలీ మీద ఎక్కువ మంది జీవిస్తున్నారు. నెలవారీ జీతాలు చాలా తక్కువ. పని చేయటానికి సిద్ధంగా ఉన్నవారు గ్రామాలలో అత్యధికంగా 75.7శాతం ఉండగా, పట్టణ ప్రాంతాలలో 51.8శాతం మంది ఉన్నారు. ఈ సంఖ్య కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 74.4శాతం, హైదరాబాద్‌లో అత్యల్పంగా 48.8శాతం ఉంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ పట్ల నీళ్లు, నిధులు, నియామకాల్లో వివక్ష చూపినట్టు సర్వే వ్యాఖ్యానించింది. 14వ ఆర్థిక సంఘం 2004-13 కాలంలో జిల్లాలవారీ ఆదాయాన్ని విశ్లేషించినప్పుడు ఉమ్మడి రాష్ట్ర ఆదాయంలో తెలంగాణ వాటా 49.5శాతంగా తేలిందని, అందులో కేవలం 38.5శాతమే ఖర్చు చేశారని సర్వే పేర్కొంది. గాడి తప్పిన విధానాలను వదిలించుకుని నిర్లక్ష్యాలు లేకుండా భాగస్వామ్యం, జవాబుదారీతనం, అభివృద్ధి లక్ష్యంగా కలిగిన ప్రభుత్వ వ్యవస్థ కోసం సంస్కరణల్ని తీసుకురావటానికి తెలంగాణ రాష్ట్రం ఒక సువర్ణావకాశమని సర్వే వ్యాఖ్యానించింది. అందరికీ అవకాశాలనిచ్చే, ముందుచూపునిచ్చే బంగారు తెలంగాణ నిర్మాణమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంది. 1) ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసే చర్యలు తీసుకోవటం 2) మౌలిక సదుపాయాలు మెరుగుపరచటం 3) సామాజిక సంక్షేమం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు బంగారు తెలంగాణ విజన్‌లో భాగమని తెలిపింది.

**సామాజిక, ఆర్థిక సర్వేలోని మరికొన్ని ముఖ్యాంశాలు :**

- వ్యవసాయంలో వరసగా రెండో ఏడాది కూడా మైనస్‌లో అభివృద్ధి రేటు నమోదుతో ప్రజల ఆదాయాలు బాగా పడిపోతున్నాయి.
- కొన్ని జిల్లాల్లో మహిళా అక్షరాస్యత, మాతాశిశు మరణాల రేటు ఆందోళనకరంగా ఉంది. వీటిని సరిచేయకుండా ఎంత అభివృద్ధిని సాధించినా ఫలితం లేదు
- ఆర్థిక పరామితుల్లో తెలంగాణ రాష్ట్రం చాలా రాష్ట్రాలను అధిగమించింది
- తెలంగాణ ప్రభుత్వానికి చెందిన విజయ పాల డెయిరీ పాలు పోసే రైతులకు లీటరుకు రూ.4 ప్రోత్సాహకం ఇవ్వటం వల్ల పాల సేకరణ బాగా పెరిగింది. గతేడాది ఏప్రిల్‌లో మొత్తం 68.2లక్షల లీటర్లను సేకరించగా, ఈ ఏడాది జనవరిలో ఏకంగా కోటీ 38లక్షల లీటర్ల పాలను రైతులు డెయిరీకి ఇచ్చారు
- తెలంగాణలో సుమారు సగం మందికి క్షయ వ్యాధి పట్ల అవగాహనే లేదు. క్షయను తొలిదశలో గుర్తించకపోవటం, ఔషధాలను క్రమంగా తీసుకోకపోవటం తదితర కారణాలు వ్యాధి ముదిరేందుకు కారణమవుతున్నాయి
- రాష్ట్ర ఆర్థిక దూకుడుకు ప్రధాన కారణమైన సేవారంగంలో మరింతమంది ఉపాధికి అవకాశముంది. ఇందుకోసం, కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్య పూర్తి చేసుకున్నవారిలో నైపుణ్యాల కొరతను అధిగమించాల్సి ఉంది
- సేవారంగంలో ఐటీ కీలకంగా ఉంది. హైదరాబాద్‌లో 1300 ఐటీ సంస్థలు, 3.7లక్షల మంది నిపుణులు ఉన్నారు. రూ.68,258 కోట్ల ఎగుమతులు జరుగుతున్నాయి. 2014-15లో 89 ఐటీ యూనిట్లు కొత్తగా వచ్చాయి
- తెలంగాణ రాష్ట్రానికి పర్యాటకులు పెరుగుతున్నారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించటంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు ముందున్నాయి. ◘

# ఏపీలో పేదరికం పదిశాతం కూడా లేదు : ఆర్థికసర్వే




**రా**జధాని ఉన్న రాష్ట్రం నుంచి సుమారు 5కోట్ల జనాభాతో దేశంలో పదో అతిపెద్ద రాష్ట్రంగా అవతరించిన నూతన ఆంధ్రప్రదేశ్.. విభజన సమస్యలకు రాజకీయ వైఫల్యం తోడవటం వల్ల తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. అంకెల్లో బాగానే ఉన్నా, ప్రజల్లో చొరవ ఉన్నా ఏ మౌలిక రంగమూ స్థిరంగా అభివృద్ధి చెందటం లేదు. ముఖ్యంగా పెద్దసంఖ్యలో ఏదోక చదువు కాగితంతో బైటికొస్తున్న యువతకు ఉపాధి కల్పించటం కొత్త రాష్ట్రానికి పెద్ద సవాలుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విడుదలైన రాష్ట్ర ఆర్థిక సర్వే కొన్ని గణాంకాలను పేర్కొంది. రాష్ట్రంలో ఒకవైపు 90శాతం మంది పేదలనే పేరుతో సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తుండగా, పేదరికం పదిశాతం కూడా లేదని సర్వే పేర్కొనటం విచిత్రం. పల్లెల్లో పేదరికం 10.96శాతం, పట్టణాల్లో 5.81శాతం ఉంది. సగటున పేదరికం 9.20శాతం మాత్రమే. జాతీయ సగటు 21.92శాతం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం, స్థూల రాష్ట్రోత్పత్తిలో 10.99శాతం నికర వృద్ధి రేటుతో జాతీయ సగటు (7.6శాతం) కంటే ఏపీ ముందుంది. "ఏపీ పునర్విభజన చట్టంలో రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీలు, పలు రంగాల్లో రాష్ట్రాన్ని ఆదుకుంటామని నాటి ప్రధాని రాజ్యసభలో చేసిన భరోసా ఇంతవరకు నెరవేరలేదు. కొద్ది నెలలుగా ఆర్థికసంఘం నుంచి వస్తున్న మద్దతు కూడా అంత ప్రోత్సాహకరంగా లేదు. చేయూతనివ్వాలని అభ్యర్థించినా రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది లేదు. (ఈ విషయాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 2015 అక్టోబర్‌లోనే బైటపెట్టి 14వ ఆర్థికసంఘం పత్రాలను కూడా మీడియాద్వారా ప్రజలకు విడుదల చేశారు. ఏ రాష్ట్రానికీ ఇవ్వని సాయాన్ని ఏపీకి ఇవ్వటం లేదని, రెవిన్యూలోటు ఉన్న పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలకు కూడా కేంద్రప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందని, ఐఐటీలు వంటి సంస్థలను కేటాయిస్తోందని స్పష్టంచేస్తూ విభజన సాయంపై అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం తెలుగు ప్రజలను మోసం చేస్తున్నతీరును జేపీ ఎండగట్టారు). కేంద్ర బడ్జెట్‌లోనూ ఏపీకి చెప్పుకోదగ్గ ప్రత్యేక కేటాయింపులు లేవు" అని ఆర్థిక సర్వే పేర్కొంది.

**సర్వేలోని ఇతర ముఖ్యాంశాలు :**

దేశ జనాభాలో ఏపీ వాటా 4.1శాతం. ఆంధ్రప్రదేశ్ జనాభా డెబ్బయి, ఎనభై దశకాలలో శరవేగంగా పెరిగి ఆ తర్వాత బాగా తగ్గుముఖం పట్టింది. గడచిన దశాబ్దపు జనాభా వృద్ధిరేటు 9.21శాతం. జాతీయ సగటు 17.72 కంటే బాగా తక్కువ. రాష్ట్ర జనాభాలో ఎస్సీలు 17.8శాతం, ఎస్టీలు 5.8శాతం ఉన్నారు.

అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ బాగా వెనకబడింది. జాతీయ సగటు 72.98కాగా, రాష్ట్రం సగటు 67.35శాతమే. మహిళా అక్షరాస్యత 59.96 శాతం (జాతీయ సగటు 64.64). పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. పదేళ్లలో పట్టణ జనాభా 24.13శాతం నుంచి 29.47శాతానికి పెరిగింది. ఏపీలో జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 304మంది. దేశసగటు 368.

రాష్ట్ర భూభాగంలో ఏటా 38.31శాతం మాత్రమే విత్తనాలు పడి సాగవుతోంది. 22.51శాతం అడవులు, 12.3శాతం వ్యవసాయేతర వినియోగంలో ఉండగా, మిగిలినవి తోటలు, బీళ్లు, చిత్తడి నేలలు వంటివిగా ఉన్నాయి. రాష్ట్రంలో ఈ ఏడాది 41.30 లక్షల హెక్టార్లలో ఆహారపంటల సాగు జరిగింది. ఇది గత ఏడాది కంటే 4.1శాతం ఎక్కువ. అయితే గత ఏడాది కంటే 14.4శాతం తక్కువగా 137.56 లక్షల టన్నుల ధాన్యాలు మాత్రమే దిగుబడి వచ్చింది. రాష్ట్రంలో సగం కుటుంబాలకి (49.38శాతం) పశుపోషణ ఆదాయవనరుగా ఉంది. మత్స్యసంపదలో ప్రపంచకేంద్రంగా ఏపీ రూపుదిద్దుకుంటోంది. ఏటా పదిశాతం వృద్ధిని సాధిస్తోంది. పశుపోషణ, మత్స్యరంగాల వల్లే రెండంకెల ఆర్థిక వృద్ధి రేటు రాష్ట్రానికి నమోదవుతోంది. రాష్ట్రంలో రూ.18,431 కోట్ల పెట్టుబడులతో 66 భారీ పరిశ్రమల నిర్మాణం జరుగుతోంది. మందులు, ప్లాస్టిక్‌లు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, సాఫ్ట్‌వేర్ కలిపి రూ.19,183.74 కోట్ల ఎగుమతుల్ని రాష్ట్రం చేస్తోంది. ఏటా 75లక్షలమంది పర్యాటకులు వస్తున్నారు. తలసరి ఆదాయం రూ.1లక్ష దాటగా, తలసరి అప్పు రూ.37,800 ఉంది. ◘

గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న

లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు

Best Wishes

ML GROUP

M. Sekhar B.com., FCA
Executive Director

Director

ML Agro Products Ltd.
K.S. Subbiah Pillai & Co. (India) Ltd.

M.L. Export

Maddi Lakshmaiah & Co.Ltd.
PostBox No. 18
CHILAKALURIPETA - 522 616
Guntur Dist. A.P.India

# చబహార్‌పై ఎట్టకేలకు కుదిరిన ఒప్పందం

ఇరాన్‌లోని కీలకమైన చబహార్ రేవు అభివృద్ధి పనుల్లో భారత్ పాలుపంచుకునేందుకు ఒప్పందం కుదిరింది. దీనిపై అన్నిరకాలుగా రూ. లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేందుకు అవకాశాలుండటంతోపాటు భౌగోళికంగా, రక్షణపరంగా కూడా మనదేశానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ఇరాన్ పర్యటనలో దీనితోపాటు భారత్, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య రవాణాకు త్రైపాక్షిక ఒప్పందంపైనా సంతకాలు జరిగాయి. ఉగ్రవాదం, తీవ్రవాదం, సైబర్ నేరాలను, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టటంలో ఉమ్మడిపోరు సాగించాలని భారత్, ఇరాన్‌లు నిర్ణయించాయి. వాణిజ్యం, రైల్వేలు, సాంస్కృతికం, శాస్త్రసాంకేతిక రంగాలలో కూడా ఒప్పందాలు కుదిరాయి. భారత్ ఆర్థికాభివృద్ధికి ఊతమిచ్చేలా రెండు దేశాల సంబంధాలూ విస్తరించాయని, దక్షిణాసియాను ఐరోపాతో అనుసంధానం చేయటం ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా చబహార్ పనుల కోసం భారత్ సుమారు రూ.3350కోట్లు సమకూర్చటం, స్వేచ్ఛావాణిజ్య మండలిల లో పరిశ్రమలను నెలకొల్పాలని ప్రతిపాదించటం వ్యూహాత్మక అడుగని అంచనా వేస్తున్నారు. చబహార్ ఉన్న ప్రాంతం భారతదేశ పశ్చిమ తీరానికి కొంత దగ్గర. పాకిస్తాన్‌లోని కరాచీ రేవు ద్వారా వెళ్లాల్సిన అవసరం లేకుండానే కొన్ని దేశాలను చేరుకోవడానికి ఈ మార్గం ఉపయోగపడుతుంది. ఈ రేవు అభివృద్ధిపై 2003లోనే నిర్ణయానికి వచ్చినా ఇరాన్‌పై ఆంక్షలు ఉండటంతో ఇప్పటిదాకా పట్టించుకోలేదు. పర్షియన్ గల్ఫ్ దేశమైన ఇరాన్ దక్షిణ తీరంలో వ్యూహాత్మక ఓడరేవుగా ఉన్న చబహార్ ద్వారా ఇరాన్‌తో సంబంధాలు పటిష్టమవటమేకాకుండా ఆఫ్ఘనిస్తాన్, రష్యా, ఐరోపా దేశాలతో అనుసంధానమవటానికి భారత్‌కు అవకాశాలు పెరుగుతాయి. పాకిస్తాన్‌లో అడుగుపెట్టకుండానే ఈ దేశాలతో సంబంధాల్ని కొనసాగించవచ్చు. ఢిల్లీ నుంచి ముంబయికి ఉన్న దూరం కంటే కాండ్లా (గుజరాత్) నుంచి ఛాబహార్‌కు ఉన్న దూరం తక్కువని కేంద్ర రోడ్డురవాణా, జాతీయ రహదారులు, షిప్పింగ్ మంత్రి నితిన్ గడ్కరీ గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఛాబహార్‌కస్వేచ్ఛావాణిజ్య మండలిలో లక్షకోట్ల పెట్టుబడులు రానున్నాయన్నారు. ఇరాన్‌లో చౌకగా లభించే సహజవాయువును ఉపయోగించుకుని నాల్కో ద్వారా 5 లక్షల టన్నుల అల్యూమినియం స్మెల్టర్ కర్మాగారాన్ని, యూరియా తయారీ పరిశ్రమలను నెలకొల్పడంపై భారతీయ



సంస్థలు ఆసక్తిగా ఉన్నాయి. చబహార్ ఒప్పందం భారత్‌కు కీలకమే అయినా చుట్టుపక్కల సముద్ర జలాల్లో చైనా దూకుడును భారత్ కట్టడి చేయగలదనే అంచనాలు మితిమీరిన ఆత్మవిశ్వాసమనే చెప్పాలి. ఇప్పటికే గదర్ పోర్టుతో పాకిస్తాన్ మక్రాన్ సముద్రతీరంలోకి అడుగుపెట్టిన చైనా చబహార్ ఒప్పందం స్థాయి కంటే అనేకరెట్లు ఎక్కువ వ్యూహాత్మక లావాదేవీలకు సిద్ధమవుతోంది. భారత్ ఎంతో దీర్ఘకాలిక దృష్టితో చౌకబారు రాజకీయాలకు తలొగ్గకుండా వ్యవహరిస్తేనే చైనాను బహుముఖంగా కట్టడి చేస్తూ ఇరాన్ తదితర ఇస్లాం దేశాల నుంచి గరిష్ట లబ్ధిని పొందగలుగుతుంది.

**భారత్‌లోనూ భారీగా ఓడరేవుల అభివృద్ధి ప్రణాళిక**

ఓడరేవుల వ్యవస్థను అభివృద్ధి చేసుకోవటం ద్వారా వృద్ధి

రేటును గణనీయంగా పెంచుకున్న చైనా పాఠాల్ని భారత్ ఎట్టకేలకు ఆచరణలోకి తెచ్చే ప్రయత్నం ప్రారంభించింది. చైనాలో సరకు రవాణా మనకంటే ఆరు రెట్లు, అంటే 2,800 మిలియన్ టన్నుల మేర ఉంది. చైనాలో ఓడరేవులు అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చెందటం వల్ల 1999లో 25వేల కోట్ల డాలర్ల మేర ఉన్న చైనా ఎగుమతులు 2014 నాటికి 2.3 లక్షల కోట్ల డాలర్లకు చేరాయి. దీంతో స్థానిక ఆర్థిక వ్యవస్థల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. చైనా కన్నా మన రవాణా వ్యయాలు మూడింతలు ఉండటం వల్ల అంతర్జాతీయ విపణిలో పోటీని తట్టుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలోనే ఆలస్యంగా మేలుకొన్న భారత్.. ప్రపంచ పెట్టుబడుల సాయంతో స్వదేశంలోనూ ఓడరేవుల అభివృద్ధికి తాజాగా భారీ ప్రాజెక్టును ప్రారంభించింది. 2025 నాటికి ఓడరేవుల సామర్థ్యాన్ని 3వేల మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిపై వ్యక్తిగత పర్యవేక్షణ ఉంటుందని ప్రధాని ఇప్పటికే పెట్టుబడిదారులకు హామీ ఇచ్చారు. భారత సముద్రరంగంలో 250 ప్రాజెక్టులలో పెట్టుబడులకు అవకాశముందని చెబుతున్నారు. 12 ప్రధాన ఓడరేవుల్లో మౌలిక సదుపాయాల వృద్ధి, 8 సముద్ర తీర రాష్ట్రాలు, ఇతర సంస్థలకు సంబంధించిన ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. దేశంలో 14వేల కిలోమీటర్లకు పైబడి అంతర్గత జలమార్గాలున్నందున ఈ రంగాన్ని అభివృద్ధి చేస్తే ఉపాధి పరంగా కూడా మంచి ఫలితాలు వస్తాయి. ఇందుకు వివిధ దేశాల సహకారం కూడా కావాల్సి ఉంటుంది. రూ.50వేల కోట్లతో 6-8 ఓడరేవులను నిర్మించాలని నిర్ణయించామని, లక్ష ఉద్యోగాలను కల్పించే 40 తీర సెజ్‌ల అభివృద్ధికీ ప్రణాళికలు రూపొందించామని గడ్కరీ చెప్పారు. వచ్చే పదేళ్లలో కోటి ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం ఈరంగంలో ఉందన్నారు. మొత్తంగా రూ.12లక్షల కోట్లతో సాగరమాల పేరుతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు బయటి దేశాల నుంచి రూ.లక్ష కోట్ల పెట్టుబడుల కోసం భారత్ ప్రయత్నిస్తోంది. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే రూ.1500 కోట్ల పనులు జరిగాయని గడ్కరీ చెప్పారు. సాగరమాల కింద నౌకాశ్రయాలను ఆధునీకరిస్తారు. కొత్త ఓడరేవుల నిర్మాణాన్ని చేపడతారు. కొత్త రవాణా సౌకర్యాల రాకవల్ల భారత్‌లో రవాణా వ్యయాలు గణనీయంగా తగ్గి రూ.45,000 కోట్ల వరకూ ఆదా అవుతుందని భావిస్తున్నారు. విద్యుత్తు, ఉక్కు, సిమెంటు, ఎరువులు, చమురుశుద్ధి కర్మాగారాలను తీరప్రాంతంలో




ఏర్పాటు చేసే ప్రణాళికలు ఏడెనిమిది లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తాయని భావిస్తున్నారు. ఇవన్నీ అమల్లోకి వస్తే కోటిమందికి ఉద్యోగాలు రావటం, మరో రెండు కోట్ల మందికి ఉపాధి నైపుణ్యాలు రావటంతోపాటు దేశ జీడీపీ అదనంగా రెండు శాతం పెరుగుతుంది.

### మిగిలిన మౌలిక వసతుల్లోనూ ఆటంకాల్ని తొలగించాం

గత రెండేళ్లలో పరిస్థితులను చక్కదిద్దామని, రానున్న మూడేళ్లలో మిగిలిన మౌలిక వసతుల రంగాల్లో కూడా పెట్టుబడులు ప్రవహిస్తాయని గడ్కరీ తెలిపారు. రూ.2.5 లక్షల కోట్ల ప్రాజెక్టులకు సంబంధించి ఆటంకాలు తొలిగాయన్నారు. రూ.3.85 లక్షల కోట్ల మేర నిలిచిపోయిన 403 ప్రాజెక్టులను పట్టాలెక్కించామన్నారు. జాతీయ రహదారుల రంగానికి సంబంధించి కేంద్ర కేబినెట్ 21 కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. రోజుకు 41 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం లక్ష్యంగా పనులు చేపడతామన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్య విధానం ఉత్తేజభరితంగా మారిందన్నారు. 17 ప్రాజెక్టులు ప్రారంభంకాగా, మరో 25వరకూ సిద్ధమవుతున్నాయన్నారు. తమ మంత్రిత్వశాఖ తీసుకున్న ప్రధాన చర్యల్లో సిమెంటు రోడ్ల నిర్మాణం ఒకటని వివరించారు. వీటికి అవసరమైన 95లక్షల టన్నుల సిమెంటును సరసమైన ధరకు అందించేందుకు 37 కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. తమ చర్యలతో జాతీయ రహదారుల పనుల్లో 39శాతం పురోగతి వచ్చినట్టు రేటింగ్ ఏజన్సీలు తెలిపాయన్నారు. మొత్తం మీద ఓడరేవుల అభివృద్ధి సహా అన్నిరకాల మౌలిక వసతులలో రూ.25లక్షల కోట్ల పెట్టుబడులు, 4 కోట్ల ఉద్యోగాలు రానున్న మూడేళ్ల లక్ష్యంగా పెట్టుకున్నట్టు మంత్రి తెలిపారు. ◘

# దిద్దుకున్నాడు, గెలిపించాడు

భారతీయులు వ్యక్తులుగా అద్భుతంగా రాణించగలరు, కానీ ఒక టీంలాగా పనిచేయాలంటే మాత్రం చేతగాదు, ఒకరినొకరు కిందకు లాగుతూ అందరూ నష్టపోతుంటారు అని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు 2014లో తాను ప్రమాణస్వీకారం చేసిన కొత్తలో ఓ సమావేశంలో అన్నారు. ఆ సందర్భంగానే ఆయన స్థానిక ప్రభుత్వాలు, సహకార వ్యవస్థల బలోపేతానికి, గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గించటానికి ఎన్నదగిన కృషి చేసిన ఎస్.కె డే గురించి కూడా మాట్లాడారు. ఆ తర్వాత తాను చెప్పిన ఆ రెండు కీలకాంశాలను కేసీఆరే చాలామేర మర్చిపోయారనుకోండి. ప్రజాస్వామ్యాన్ని పక్కాగా అమలుచేయడం కోసం తాను నియంతగానే ఉండాలని, కేంద్రీకృత పాలన మన ప్రజాస్వామ్యానికి అవసరమని నమ్ముతూ, తనకు తందానా అనే వారి పొగడ్తలను ఆయనిప్పుడు ఆస్వాదిస్తున్నారు. ప్రపంచంలో మనకంటే అనేకరెట్లు వేగంగా అభివృద్ధి చెందిన జపాన్, అమెరికా వంటి దేశాలలో ఉదార ప్రజాస్వామ్య విలువలు తప్ప నియంతృత్వం పెద్దగా కనిపించదన్న తర్కం ఆయనకు, ఆయన చుట్టూ వున్నవారికీ తట్టటం లేదు.

కేసీఆర్ మర్చిపోయిన వాటిల్లో మొదటి అంశంగా ఉన్న సమష్టి కృషి.. అంటే ఎవరు చెబుతున్నారు అని కాకుండా, ఏం చెబుతున్నారు అనే ప్రాతిపదికన పనిచేయటం గురించే, ఇటీవల ఐపీఎల్ కప్పును కేసీఆర్ చేతికి అందించటంలో కీలక పాత్ర పోషించిన హైదరాబాద్ సన్‌రైజర్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ గురించే మనం ఇప్పుడు మాట్లాడుకోబోతున్నది.

డేవిడ్ వార్నర్ ఈవేళ్టి సోషల్ మీడియా యువతరంలో ఎక్కువశాతానికుండే అసహనం, దురుసుతనం, నచ్చకపోతే శత్రువులా భావించటం వంటి ప్రతికూల భావాలతో తన క్రికెట్‌ను ప్రారంభించిన ప్రతిభాశాలి. ఒక్క ఫస్ట్ క్లాస్ మ్యాచ్ కూడా ఆడకుండానే ఆస్ట్రేలియా తరపున ఆడిన తొలి క్రికెటర్. ఫార్మాట్ ఏదైనా దూకుడుగా ఆడే వార్నర్.. తనలోని ప్రతికూల భావాలు తననో చిల్లర వ్యక్తిగా తయారుచూపిస్తూ తన ప్రతిభను మసకబారుస్తున్నాయని క్రమంగా గుర్తించాడు. గుర్రప్పందాలు చూడటానికి సొంత క్లబ్ మ్యాచ్‌కి డుమ్మా కొట్టడం, జర్నలిస్టులను, ఇతర దేశాల క్రికెటర్లను దుర్భాషలాడటం, 2013లో ఛాంపియన్స్ ట్రోఫీలో ఇంగ్లండ్‌తో మ్యాచ్ ఓడాక పబ్‌లో జో రూట్ మొహం మీద పిడిగుద్దులు కురిపించటం.. ఇలా ప్రతి తప్పునూ పనిగట్టుకుని సమీక్షించుకుని దిద్దుకున్నాడు. కెరీర్‌లో దీర్ఘకాలం కొనసాగేందుకు కావలసిన సాధనను, సంయమనాన్ని, సమష్టి తత్వాన్ని అలవర్చుకున్నాడు. 2015 ఐపీఎల్‌లో ఆరెంజ్ క్యాప్ అందుకున్నాడు. 2016 ఐపీఎల్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్‌కు కెప్టెన్‌గా అవకాశాన్ని అందుకున్నాడు, సద్వినియోగం చేసుకున్నాడు. అనుభవంలేని జట్టు, వరస వైఫల్యాలతో సన్‌రైజర్స్ తొలిదశలో పట్టికలో చిట్టచివర ఉండేది. ప్రతి ఒక్కరికీ సానపట్టటంతోపాటు సమష్టిగా ఒక వ్యూహాన్ని సిద్ధం చేసుకుని వార్నర్ పకడ్బందీగా అమలు



చేశాడు. కొందరికి రొటీన్‌గా అనిపించినా, ఒకే తరహాలో వార్నర్ బౌలింగ్, ఫీల్డింగ్ వ్యూహాలు సాగాయి. ప్రతి మ్యాచ్‌లోనూ ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా తనదైన శైలిలో మరఫిరంగిలా బ్యాటింగ్ చేశాడు. చాలాసార్లు ఓటమి ఖాయం అనుకున్న సమయంలోనూ మిగతా ఆటగాళ్ల వైఫల్యాన్ని భర్తీ చేస్తూ వార్నర్ బ్యాటింగ్‌లో అసాధారణ సామర్థ్యాన్ని చూపాడు. వరసగా మూడు మ్యాచ్‌లో 90 నాటౌట్, 74 నాటౌట్, 59తో మొండిగా నిలబడి హైదరాబాద్‌కు హ్యాట్రిక్ విజయాల్ని అందించాడు. ఈ సీజన్లో వార్నర్ చేసిన పరుగులు 848కాగా, జట్టులోని మిగతా ఆటగాళ్లు అందరూ కలిసి చేసిన పరుగులు 1577. ఇంత స్ఫూర్తినివ్వబట్టే, ఐపీఎల్ చివరి కొచ్చేసరికి అనామకులైన ఆటగాళ్లు కూడా ప్రకృతి తమకిచ్చిన ప్రతిభాపాటవాల్ని వెలికితీసుకుని సత్తా చూపారు. యువరాజ్ సింగ్ వంటి సీనియర్ల సాయాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటూ ముస్తాఫిజుల్, భువనేశ్వర్, బెన్ కటింగ్ వంటి వర్ధమాన ఆటగాళ్లను సానబట్టి ఫలితాలను రాబట్టుకున్నాడు. గత రెండు సీజన్‌లలో పట్టికలో ఆరోస్థానంలో ఉన్న హైదరాబాద్ జట్టులో ఈ సీజన్‌లో అద్భుతమైన మార్పులేవీ రాలేదు. కానీ వారితోనే వార్నర్ కప్పును సాధించాడు. చౌకబారు వివాదాలతో ఆస్ట్రేలియాలో కెప్టెన్సీని కోల్పోయిన వార్నర్.. తాజా సీజన్‌లో ప్రశాంతంగా, పరిణతితో, సమష్టితత్వానికి సంకేతంగా నిలిచి తన శక్తి మేర పోరాడటంతో ఈ విజయం సాధ్యమైంది, ఫెయిర్ ప్లే అవార్డూ దక్కింది. విరాట్ కోహ్లీ, గేల్, డివిలియర్స్ వంటి దిగ్గజాలున్నా, వాళ్లు గెలవాలని మనసులో ఎంత కోరికున్నా, ఐపీఎల్ కప్పును అన్ని విధాలా అర్హమైన హైదరాబాద్ జట్టే గెలిచింది అని అనేకమంది వ్యాఖ్యానించటానికి కారణం వార్నర్ టీం లీడర్‌షిప్. ఒకవేళ ఫైనల్లో వార్నర్ ఓడినా అతనికి కప్పు కంటే ఎక్కువైన ఛాంపియన్ హోదాయే వుండేది. వార్నర్ నుంచి నేర్చుకుంటూ క్రికెట్ అనే చిన్న రంగం నుంచి రాజకీయమనే మౌలికమైన, విస్తృతమైన రంగానికి ఈ సమష్టి కృషి విజయాల సంస్కృతిని విస్తరింప చేసుకోవటం ఇప్పుడు యువత ముందున్న ఛాలెంజ్. రాష్ట్ర, జాతీయస్థాయి నాయకత్వానికి ఓపిక లేకపోతే, స్థానిక, వార్డు నాయకత్వాన్నయినా అందించగలిగితేనే ఐపీఎల్ చూసినందుకు సార్థకత. ◘

# ఎన్నికల సంస్కరణలపై చర్చకు దీదీ పిలుపు

ఎన్నికల్లో డబ్బు రాజకీయాన్ని ప్రారంభించి ఆ భయంకర జాడ్యాన్ని మిగతా దేశమంతటికీ అంటించిన దక్షిణాది నేతల్లో తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రముఖుడు. ఇప్పుడు ఆ ఉచ్చులో నుంచి బైటికి రాలేక ప్రతి ప్రధాన సాంప్రదాయ పార్టీ అల్లాడిపోతోంది. బీజేపీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఆ పార్టీ చేస్తున్న ప్రచార ఖర్చులకు, చూపుతున్న వివరాలకు పొంతన కనిపించదు. రాష్ట్ర స్థాయిలోగానీ, జాతీయస్థాయిలోగానీ చాలా అవినీతి కుంభకోణాలు కేవలం ఎన్నికల్లో గెలుపు కోసమే జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ఇలా తీసుకునే ముడుపుల్లో కొంత వ్యక్తిగతంగా కూడా వెనకేసుకుంటుంటారు. ఇటీవలి జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనే వెయ్యి కోట్ల వరకూ ఖర్చయినట్టు చెబుతున్నారు. ఇది అత్యంత ఖరీదైనవిగా ప్రపంచం భావించే అమెరికా అధ్యక్ష ఎన్నికలను కూడా తోసిరాజనే ఖర్చు.




నేతలు వ్యక్తిగతంగా అవినీతి చేసినా, పార్టీ గెలుపు కోసం చేసినా ప్రజలకు మాత్రం నష్టంలో తేడా ఏమీ ఉండదు. పోయేది ప్రజల సొమ్మే, ఖర్చయ్యేది బిచ్చంలాగా తప్ప ప్రజల జీవితాల్ని బాగు చేసే విధంగా కాదు. కాబట్టి ఎన్నికల్లో నల్లధనం ప్రవాహాన్ని అంతం చేయకతప్పదు. ఇందుకోసం లోక్‌సత్తా కృషితోనే 2003లోనే వచ్చిన పార్టీల విరాళాల చట్టంతోపాటు ఇంకా సంస్కరణలు కావాల్సుంది. ఎన్నికల్లో డబ్బు ప్రవాహాన్ని నియంత్రించేందుకు మిగిలిన సంస్కరణల గురించి లోక్‌సత్తా ఎంత చెబుతున్నా ఇంకా పార్టీలకు, పాలకులకు బుర్రకెక్కటం లేదు. ఈ క్రమంలోనే దామాషా ఎన్నికల పద్ధతి కోసం 2004లో లోక్‌సత్తా గట్టిగా ప్రయత్నిస్తే అప్పటి సీపీఎం జాతీయ కార్యదర్శి ప్రకాష్ కారత్ తదితరులు కలిసి రాలేదు. ఆరోజు యూపీయేలో భాగస్వాములుగా ఉన్న కమ్యూనిస్టులు కలిసివచ్చినట్టయితే ఖచ్చితంగా మన ఎన్నికల వ్యవస్థ మారి ఉండేది. ఈరోజు సమర్థులు నిజాయతీపరులకు అవకాశాలు పెరిగేవి, కమ్యూనిస్టులకు కూడా అవకాశాలు మెరుగ్గా ఉండేవి. కానీ వేం సూత్రప్రాయంగా దామాషా ఎన్నికల పద్ధతిని సమర్థిస్తాం తప్ప అందుకోసం డిమాండ్ చేయం అంటూ రోజువారీ రాస్తారోకోలు, హర్తాళ్లకే వారు పరిమితమయ్యారు. సదాశయాలు ఉన్నవారు కూడా దేశప్రయోజనాలకు ఎలా నష్టం చేకూరుస్తారో ఈ పరిణామాలు తెలియచేస్తాయి. ఇప్పుడు నాలిక్కరుచుకుంటున్నారు. కానీ ఉపయోగమేంటి? ఈవేళ తక్కువ ఓట్లశాతంతో ఎక్కువ సీట్లు గెలుస్తున్న బీజేపీ ఆ ఊసే ఎత్తటానికి ఇష్టపడటం లేదు. మళ్లీ సరైన సమయం కోసం ఎదురుచూడాలి.

ఈ నేపథ్యంలో తాజాగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నేత మమతా బెనర్జీ ఎన్నికల్లో డబ్బు ప్రవాహాన్ని అరికట్టాలని పిలుపునివ్వటం, ఎన్నికల్లో నల్లధనం వినియోగంపై చర్చ జరగాలని డిమాండ్ చేయటం కొత్త ఆశను రేకెత్తిస్తోంది.

ఎన్నికల్లో అఖండ విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర అసెంబ్లీనుద్దేశించి మమత మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో నల్లధనం వినియోగం తగ్గటానికి ప్రభుత్వమే ఎన్నికల వ్యయాన్ని భరించాలని అభిప్రాయపడ్డారు. ఎన్నికలకు ప్రభుత్వ వ్యయం, ఎన్నికల సంస్కరణలు, ఆర్థిక సంస్కరణలపై చర్చ జరగాలని అన్నారు.

ఎన్నికల్లో అక్రమ డబ్బు వినియోగాన్ని అరికట్టటానికి మమతా బెనర్జీ ప్రతిపాదనను పరిష్కారంగా అంగీకరించ లేకపోయినా, దేశాన్ని అసమర్థులు, దోపిడీ దారులు, తాత్కాలిక తాయిలాలు, వంశపారంపర్య నేతల బారిన పడేస్తున్న ఈ కీలక సమస్యపై చర్చ జరగాలన్న ఆమె పిలుపును ఒక అవకాశంగా మలచుకునేందుకు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులు, పౌర సమాజం ప్రయత్నించాలి. ◘

# హేతుబద్ధ వాదనలు లేని మూర్ఖుడు ట్రంప్



హేతుబద్ధ వాదనలతో కాకుండా ప్రజలను రెచ్చగొట్టే మాటలతో ప్రచారం పొందే మూర్ఖుడు డొనాల్డ్ ట్రంప్ అని ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ అన్నారు.

బ్రిటన్‌కు చెందిన ఐటీవీ న్యూస్‌కిచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ తరపున పోటీపడుతున్న డొనాల్డ్ ట్రంప్‌పై ఆయన ఈ వ్యాఖ్యను చేశారు. ట్రంప్‌కి ఇంత ఆదరణ ఎలా వస్తోందో మాత్రం తాను వివరించలేనని హాకింగ్ అన్నారు. ◘

# దేశవ్యాప్త వికేంద్రీకరణ విధానంలో భాగంగా మాత్రమే కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి : జేపీ



కాశ్మీర్‌కు మాత్రమే మరింత స్వయంప్రతిపత్తి కల్పించాలన్న డిమాండ్‌లను ఆమోదించలేమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్పష్టంచేశారు. ఎటువంటి వికేంద్రీకరణయినా దేశ సమగ్రత, సమైక్యత పరిధిలోనే ఉండాలని, కాశ్మీర్ వేరు–మిగతా దేశమంతా వేరు అనే ధోరణిని అనుమతించకూడదని అన్నారు. రాజకీయం, పాలన రాష్ట్రాల చుట్టూనే తిరుగుతున్నందున, వ్యవస్థలో మార్పులు తేవటానికి రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛ ఉండాల్సిందేనని, అందుకే దేశవ్యాప్తంగా రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తి ఉండాలని లోక్‌సత్తా వాదిస్తోందని, దేశవ్యాప్త వికేంద్రీకరణ విధానంలో భాగంగా కాశ్మీర్‌కు కూడా స్వయంప్రతిపత్తి కల్పించాలంటే స్వాగతిస్తామని అన్నారు. స్థానిక, రాష్ట్ర ప్రభుత్వాలకు స్వయంప్రతిపత్తి, ప్రజలకు పాలనలో రోజువారీ భాగస్వామ్యం కల్పించటం ఇప్పుడు దేశం ముందున్న సవాలని, దీన్ని అధిగమించటం మీదే భారత్ ఏ స్థాయికి ఎదగగలుగు తుందన్నది ఆధారపడివుంటుందని జేపీ అన్నారు. ◘

---

# అమెరికా మేయర్లు ఎంత గొప్పో !



అమెరికా పర్యటనలో భాగంగా కార్మెల్ నగర మేయర్ జిమ్ బయనార్డ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న తెలంగాణ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్

అధికారాన్ని వికేంద్రీకరించకుండా, దిగువస్థాయిలో ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలు చేసి కేవలం సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన సేవలు, అవినీతి లేని పాలనను రాజధాని నుంచే అందించే కేంద్రీకృత పాలన ప్రయోగాన్ని చేయటంలో తెలంగాణ ప్రభుత్వం కూడా కేంద్రంతో, ఏపీ ప్రభుత్వంతో పోటీపడుతోంది. ఇటీవల అమెరికా వెళ్లిన రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి కె.తారకరామారావు మన నగరాలలో మెరుగైన పాలనకు అమెరికాలోని మేయర్ల నుంచి పాఠాలు అడిగితెలుసుకున్నారు. తమ అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో లండన్ మేయర్ గురించి కూడా చర్చించిన అమెరికాలో స్థానిక పాలన అంతా ఆ పట్టణం, నగరం పరిధిలోనే నిర్ణయమవుతుంది. అందుకే ఆ ఊరు వెళ్లినప్పుడు అక్కడి మేయర్‌ను ప్రత్యేకించి కేటీఆర్ కలుసుకున్నారు. పాపం ఎన్నో కోట్లు ఖర్చుపెట్టి గెలిచిన మన హైదరాబాద్‌లో మేయర్, కార్పొరేటర్లు మాత్రం ఏం చేయాలో తెలియక బిక్కమొహాలతో ఉన్నారు. ఏదోక ప్రారంభోత్సవానికెళ్లయినా కాస్త మీడియాలో కవరేజీ తెచ్చుకుంటూ, ఎన్నికల్లో పెట్టిన ఖర్చును వడ్డీతో సహా నొల్లుకుంటే చాలు అన్నట్టు వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ అమెరికాలో ఉన్నారు, ఇక్కడ మేయర్ గురించీ తెలియదు, ఆయన ఏం చేస్తారో అంతకన్నా తెలియదు, స్థానికంగా ఉన్న వాళ్ల నిమిత్తమాత్రులు, ఫోన్ చేయగానే సిబ్బంది ఆగమేఘాల మీద వచ్చి రోడ్లు శుభ్రం చేయటానికి గవర్నర్ నరసింహన్‌కున్న పలుకుబడి మనకు లేదు.. దీంతో ఈమధ్య హైదరాబాద్‌లో గాలిదుమారం వచ్చి చెట్లు కూలిపోయి బీభత్సం జరిగినప్పుడు ప్రజలు తమ ఖర్మ అనుకోవటం మినహా ఏమీ చేయలేకపోయారు. ప్రజల భాగస్వామ్యం లేని పార్టీస్వామ్యం, ఉద్యోగస్వామ్యం తాత్కాలికంగా ఉపశమనాన్ని మాత్రమే ఇస్తుందని పాలకులు, ఓటర్లు సాధ్యమైనంత త్వరగా గుర్తిస్తారని ఆశిద్దాం. ◘

# మెరుగ్గా ఉంది.. కానీ నిజమైన పరివర్తనకు చాలదు, మూడు కీలక దిద్దుబాట్లు కావాలి: మోదీ రెండేళ్ల పాలనపై జేపీ



నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇతర ప్రభుత్వాలకన్నా మెరుగ్గా పనిచేస్తోందని, అయితే భారతదేశ నిజమైన పరివర్తనకున్న అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవటానికి అది చాలదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో పనిచేసేలా చేయటం, ప్రజలంతా ఉత్పాదక శక్తులుగా తయారయ్యేలా ప్రోత్సాహకాలను మార్చటం ఎలా అన్నదే ఇప్పుడు మోదీ ముందున్న అసలైన సవాళ్లన్నారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జేపీ స్పందిస్తూ.. ద్రవ్య నిర్వహణ, ద్రవ్యోల్బణ నియంత్రణ, మౌలిక వసతుల నిర్మాణంలో మోదీ ప్రభుత్వ రికార్డు ఆకట్టుకునేలా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంలో అవినీతికి కళ్లెం పడిందన్నారు. లక్ష్యం, సాధించాలన్న తపన సర్కారులో కనిపిస్తున్నాయన్నారు. దౌత్యంలో ఉత్సాహం, చొరవ వల్ల విదేశాల్లో పలువురు మిత్రులను భారత్ సంపాదించుకో గలిగిందన్నారు. చమురు ధరలు తగ్గడం వంటి సానుకూల పరిణామాలు తోడవటంతో భారత్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా రూపుదిద్దుకుందన్నారు. పాలన, రాజకీయాలు ప్రధానంగా రాష్ట్రాల చుట్టూనే తిరుగుతున్నందున సహకార సమాఖ్య విధానం, నీతి ఆయోగ్, రాష్ట్రాలకు 42శాతం నిధుల బదిలీ వంటివి ఆహ్వానించదగ్గ పరిణామాలన్నారు. కానీ మూడు కీలకమైన దిద్దుబాట్లను మోదీ ప్రభుత్వం చేపట్టాల్సుందని జేపీ స్పష్టంచేశారు.



1. విద్య, ఆరోగ్య రంగాలను ఫలితాల ప్రాతిపదికన సమూలంగా ప్రక్షాళన చేయాలి
2. స్థానిక ప్రభుత్వాలు, చట్టబద్ధ పాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందించే సేవలను గణనీయంగా మెరుగుపరిచేందుకు వ్యవస్థీకృత ఏర్పాట్లు చేయాలి
3. మత, కుల దురభిమానాలను, ఆధిపత్యాలను అదుపు చేయాలి

"చైనా అభివృద్ధి మందగించటం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సానుకూల వాతావరణం, రాజకీయ స్థిరత్వం, అత్యధిక యువజనాభా భారత్ ఉచ్ఛస్థితికి అనువైన పరిస్థితులని, వీటిని సదవకాశంగా మలచుకోవాలంటే 'ప్రజలు మంచి చేయటాన్ని తేలికగా, చెడు చేయటాన్ని కష్టంగా భావించే పరిస్థితుల్ని నెలకొల్పటమే ప్రభుత్వం పని' అన్న గ్లాడ్‌స్టోన్ మాటలను అమలు చేయటమే మోదీ చేయాల్సిన పని" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ◘

# కొలీజియం నిర్ణయం దైవవాక్కు

ఉన్నత న్యాయమూర్తుల నియామకాలలో పారదర్శకతకు లోక్‌సత్తా కృషితో వచ్చిన జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ రాజ్యాంగ సవరణను అప్రజాస్వామికంగా కొట్టివేసి కొలీజియం వ్యవస్థను కొనసాగిస్తున్న సుప్రీంకోర్టుతో కేంద్ర ప్రభుత్వానికి మరో వివాదం తలెత్తింది. కొలీజియం చెప్పిన పేర్లను తిరస్కరించే అధికారం ఉండాలని ప్రభుత్వం, తాము చెప్పిన పేర్లనే న్యాయమూర్తులుగా ఖరారు చేయాలని న్యాయవ్యవస్థ పట్టుబడుతున్నాయి. 'విధాన ప్రక్రియ నివేదిక'లో మార్పులు చేయటానికి ప్రభుత్వానికున్న హక్కును సుప్రీంకోర్టు కొలీజియం ప్రశ్నించి తిప్పిపంపింది. దీనిపై త్వరలో స్పందిస్తామని ప్రభుత్వం తెలిపింది. ◘

# రిజర్వేషన్ కోటాల పెంపు నుంచి నాణ్యమైన విద్య, ఎదిగే అవకాశాలవైపు చర్చను మళ్లించాలి: జేపీ

రిజర్వేషన్ కోటాల పెంపు నుంచి ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, నిజమైన అవకాశాలు అందించటం వైపు చర్చను మళ్లించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ దేశంలోని రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాలకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో కాపులు, గుజరాత్‌లో పాటిదార్లు, హర్యానాలో జాట్లు, రాజస్థాన్‌లో గుజ్జర్లు చేస్తున్న రిజర్వేషన్ ఉద్యమాల పట్ల సృజనాత్మకంగా స్పందించాల్సుందని జేపీ అన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ అబద్ధమన్నా అవుతుంది లేదా అందరికీ నష్టం చేకూర్చే కులాల కురుక్షేత్రానికైనా దారి తీస్తుందన్నారు. ఈ వాస్తవాలను గుర్తించకుండా అగ్రవర్ణ పేదల సమస్యలకు రిజర్వేషన్లే పరిష్కారమన్నట్టు తాజాగా కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెప్పటం విచారకరమన్నారు.




చాలా రాష్ట్రాలలో రిజర్వేషన్ కోటాలు సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిమితికి చేరుకున్నాయని జేపీ అన్నారు. ఇప్పుడు ఓసీలకు రిజర్వేషన్లు ఇస్తామంటే.. సుప్రీంకోర్టు కొట్టివేస్తుంది లేదా మిగిలిన కులాల నుంచి డిమాండ్లు మొదలవుతాయన్నారు. రిజర్వేషన్ పరిధిలోని కులాల్లో ఉన్నా, అగ్రకులాల్లో ఉన్నా నిజమైన పేదలకు న్యాయం చేయాలనుకుంటే రిజర్వేషన్ల కోటా ఇస్తామన్న భ్రమలు కల్పించకుండా “1) రిజర్వేషన్లలో క్రీమీ లేయర్‌ని తొలగించటం 2) ప్రభుత్వ లేదా దిగువస్థాయి ప్రయివేటు పాఠశాలలకు వెళ్తున్న పిల్లలకు కొన్ని మార్కులను అదనంగా కలపటం 3) తల్లిదండ్రుల ఆదాయం, కులంతో సంబంధం లేకుండా 12ఏళ్ల స్కూలు విద్య తర్వాత ఎవరితోనైనా పోటీపడగలిగే స్థాయిలో విద్యార్థులను తయారుచేసేలా పాఠశాల విద్యాప్రమాణాలను మెరుగుపరచటం” చేయాలన్నారు.

విద్యారంగంలో ఇప్పటికే తీవ్రంగా ఉన్న సంక్షోభం పెరిగిపోతోందని, డబ్బు, అవకాశాలున్న కొద్దిమంది మాత్రమే మంచి చదువులు అందుకోగలుగుతున్నారని జేపీ అన్నారు. ఎంత ప్రతిభ ఉన్నా పేదవిద్యార్థులకు నాణ్యమైన చదువు భారంగా ఉందన్నారు. విద్య.. సమానత్వాన్ని, అవకాశాల్ని పెంపొందించాలని, కానీ మన విద్యావ్యవస్థ అసమానతల్ని పెంచిపోషిస్తోందని, పేదకుటుంబాల నుంచి వచ్చిన ఆణిముత్యాలకు అవకాశాలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మనం మేలుకోకపోతే భారత్ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని, రిజర్వేషన్ కోటాలను దాటి అందరి పిల్లలకూ నాణ్యమైన విద్య, సరైన ఎదిగే అవకాశాలను అందించటం ఇప్పటికైనా ఎజెండా కావాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

www.twitter.com/jp_loksatta

www.facebook.com/jploksatta ◘

గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న

లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు



గత శతాబ్దకాలంగా వాస్తవాల్ని ప్రజల ముందు వుంచి పాఠకుల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న
లోక్‌సత్తా పక్ష పత్రికకు ఇవే మా శుభాకాంక్షలు




Posting Date 22-06-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on June16th 2016




Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad